thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 192 | జగిత్యాల శుక్రవారం 23 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

మరో 30 ఏళ్లు కాంగ్రెస్ అధికారానికి దూరమే

- రాహుల్‌పై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు
- ప్రజల్లోకి వెళ్లకుండా నిరసనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్న
- ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్, మిత్రపక్షాలకు కౌంటర్

4



ఇంటర్నేషనల్ నెట్‌వర్క్!

ఫాక్స్ న్యూస్ దర్యాప్తు నివేదికలో సంచలన ఆరోపణలు

3



అంతర్జాతీయ నిరసనల వెనుక పలు దేశాలకు విస్తరించిన సంస్థల నెట్‌వర్క్ ఉందంటూ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన దర్యాప్తు కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనల మధ్య సంబంధాలున్నాయని ఆ కథనం సంచలన ఆరోపణలు చేసింది.

కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం

జాబితాలో లేని వారి వివరాలు ఇవ్వండి



సొంతగడ్డపై సీఎం సందడి!

2

కొడంగల్ నివాసంలో ప్రజలు, నేతలతో ఆత్మీయ కలయిక

రాబోయే కేబినెట్ భేటీలో కుల గణనపై ప్రత్యేక చర్చ

ముదిరాజులను బీసీ-ఏలో చేర్చేందుకు న్యాయ సలహాలు

- పీసీసీని ఒప్పించి ఎమ్మెల్సీ సీట్లు ఇప్పించే బాధ్యత మంత్రి పొన్నానిదే!
- ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య, పండుగ సాయన్న విగ్రహాలు
- రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకల్లో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 22 :: తెలంగాణలో చేపట్టిన సమగ్ర కుల గణన లెక్కల్లో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే వాటిని వెంటనే సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏ కులానికి చెందినవారైనా గణాంకాల్లో తప్పులున్నాయని భావిస్తే, లెక్కల్లోకి రాని వారి వివరాలను నేరుగా ప్రభుత్వానికి అందించాలని కోరారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన మార్పులు చేస్తామని, రాబోయే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. బ్రిటిష్ పాలన తర్వాత దేశంలోనే తొలిసారిగా వందేళ్ల నాటి పాత రికార్డులను పక్కనపెట్టి.. ధైర్యంగా సమగ్ర కుల గణన

మిగతా 2 లో



ఎమ్మెల్సీ, సింగరేణి ఎన్నికలపై బీఆర్ఎస్ సమరశంఖం

- రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జిల నియామకం
- కార్మికుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- తెలంగాణ భవన్‌లో నేతలతో కేటీఆర్ కీలక సమీక్షలు

2

రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ కదనరంగంలోకి దూకింది.

పోలీసులకే హనీట్రాప్!



2



2

రోజుకు 140 మిలియన్ యూనిట్ల థర్మల్ విద్యుత్

- విద్యుత్ కొరత రాకుండా చర్యలు చేపట్టాలి
- మూతపడిన పరిశ్రమల బకాయిలపై 'ఓటీఎస్'
- ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

2



హైదరాబాద్‌లో దక్షిణ రాష్ట్రాల డీజీపీల భేటీ

నేడు టీజీఐసీసీలో ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం

.. వివరాలు 2లో

కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువు

- సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ వైఫల్యంతోనే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు.

వివరాలు 3వ పేజీలో



వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలి!

3

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు



హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

దసరా సెలవులు ముగిసి ప్రజలు తిరిగి నగరానికి పయనమవడంతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పండుగ సెలవులు ముగించుకుని సిటీకి వస్తున్న వాహనదారులతో హైవే కిటకిటలాడింది.

3



హైదరాబాద్‌లో దక్షిణ రాష్ట్రాల డీజీపీల భేటీ!

నేడు టీజీఐసీసీసీలో ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాల్గొననున్న 5 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు బాస్‌లు

కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రతా బలగాల అధికారుల హాజరు

సైబర్ నేరాలు, డ్రగ్స్, ఏఐ వినియోగంపైనే ప్రధాన చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 22 :: దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం జరగనుంది. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో నిర్వహించే ఈ భారీ భేటీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డీజీపీలు, ఐజీలు హాజరుకానున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు, భద్రతా సంస్థలైన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), సీబీఐ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ అధికారులు సైతం ఈ సమావేశంలో పాల్గొననున్నారు.



ఎజెండాలో కీలక అంశాలివే..

ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, పరస్పర సహకారం, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇందులో విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదకద్రవ్యాల (డ్రగ్స్) అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా వంటి కీలక అంశాలు ఈ సమావేశం ఎజెండాలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచే మార్గాలపై సమీక్షించనున్నారు. వీటితో పాటు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం తదితర అంశాలపైనా ప్రధానంగా చర్చించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్న ప్రధాన లక్ష్యంతోనే ఈ సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు.

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం!

రైతులకు మద్దతు ధర దక్కేలా పకడ్బందీ చర్యలు

అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష

ఈ ఏడాది 133 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 22 :: రాష్ట్రంలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గతేడాది మాదిరిగానే వెంటనే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రెటేరియట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. (గత సీజన్‌లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది). కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదికి పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించగా.. ప్రస్తుతం రాష్ట్రంలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000 పలుకుతోందని అధికారులు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే మార్కెట్లో రూ.333 అదనంగా లభిస్తున్నందున, రైతులు ప్రస్తుతానికి బహిరంగ మార్కెట్లలోనే పత్తిని విక్రయించుకోవాలని మంత్రి సూచించారు. ఒకవేళ ధరలు తగ్గి ఎంఎస్పీ కంటే దిగువకు వస్తే అప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

335 జిన్నింగ్ మిల్లుల నోటిఫై..

ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత ఏడాది ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచింది. రాష్ట్రంలో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం జీవోలు 640, 641 ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు పత్తి మార్కెట్ ధరలు, కొనుగోళ్ల పురోగతి, కేంద్రాల్లోని సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. పత్తిని సేకరించి మార్కెట్లకు తరలించే సమయంలో నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

'కపాస్ కిసాన్ యాప్'తో పారదర్శకత..

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు కపాస్ కిసాన్ యాప్, ఆన్‌లైన్ చెల్లింపులు, రైతుల వివరాల ధ్రువీకరణ వంటి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే 12,75,185 మంది రైతులకు సంబంధించిన వివరాలను యాప్‌తో అనుసంధానం చేశారు. రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే ముందు యాప్‌లో తమ వివరాలను సరిచూసుకోవాలి. సగటు దిగుబడి కంటే ఎక్కువ వచ్చిన రైతులు, కౌలు రైతులు తమ వివరాల నమోదు కోసం భూమి, ఆధార్ వివరాలతో ఏఈవోను సంప్రదించాలి. ఇక పత్తి రైతులకు సమాచారం, సహాయం అందించేందుకు మార్కెటింగ్ శాఖ 1800-599-5779 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు, 8897281111 వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం!

- **గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి**



(మొదటి పేజీ తరువాయి..)

చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ ఈ సందర్భంగా సగర్వంగా పేర్కొన్నారు.

ముదిరాజులకు బీసీ-ఏ..

ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో చేర్చే అంశంపై త్వరలోనే న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం వల్ల గంగపుత్రుల్లో ఉన్న అపోహలను, అనుమానాలను సైతం తొలగిస్తామని స్పష్టం చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని, వారికి విదతలవారీగా సముచిత పదవులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇకపోతే ముదిరాజులకు ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు విషయంలో పీసీసీని ఒప్పించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్ వెల్లడించారు.

ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు..

గత పాలనతో పోలిస్తే మెరుగ్గా తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం వివరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్యతో పాటు పండుగ సాయన్న విగ్రహాలను సగర్వంగా ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలమని పేర్కొన్న సీఎం రేవంత్.. దేశంలో బలహీన వర్గాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధానమంత్రి కావాలని పిలుపునిచ్చారు.

సొంతగడ్డపై సీఎం సందడి!

- **కొడంగల్ నివాసంలో ప్రజలు, నేతలతో ఆత్మీయ కలయిక**
- **ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలపై ఆరా**
- **'పేదల తిరుపతి'లో స్వామివారికి ప్రత్యేక పూజలు**
- **ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన, అధికారులకు సూచనలు**



కొడంగల్ :: దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, అభిమానులు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం రేవంత్ సైతం ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పండుగ వేళ ప్రజలు, నాయకులతో సాగిన ఈ ఆత్మీయ కలయిక కొడంగల్‌లో పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది. కొడంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం రాకతో నియోజకవర్గంలో పండుగ సందడి నెలకొంది. కొడంగల్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ. 110 కోట్లతో చేపట్టిన పనులను రేవంత్ రెడ్డి పరిశీలించారు. నాలుగు వైపులా రాజగోపురాలు, మాడవీధులు, పుష్కరిణి నిర్మాణంతో పాటు భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, జిల్లా అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి పి.వి.శ్రీనివాసరాజు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఆలయ పనుల పరిశీలన అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలతో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజల వద్దకు వెళ్లిన రేవంత్ రెడ్డి వారి సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, ఎంపీడీవో జయశ్రీ, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సందడితో కొడంగల్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



రోజుకు 140 మిలియన్ యూనిట్ల థర్మల్ విద్యుత్!

రబీ, వేసవికి విద్యుత్ కొరత రాకుండా చర్యలు చేపట్టాలి

మూతపడిన పరిశ్రమల బకాయిలపై 'ఓటీఎస్' విధానం

విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 22 :: ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, రానున్న రబీ, వేసవి సీజన్లలో విద్యుత్ కొరత రాకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో విద్యుత్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, దాన్ని మరింత పెంచాలన్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లోని ఐదో యూనిట్‌ను త్వరితగతిన పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌కు నవంబర్ నుంచి కోల్ ఇండియా ద్వారా ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా ప్రారంభం కానుందని అధికారులు వివరించారు.

మూతపడిన పరిశ్రమలకు ఓటీఎస్..

రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమల పెండింగ్ విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం తీసుకురావాలని, ఇందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. దీనివల్ల పరిశ్రమలకు వెసులుబాటుతో పాటు పంపిణీ సంస్థలకు బకాయిలు వసూలవుతాయన్నారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కోలకు వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారుల నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు.

నిరసనల వెనుక ఇంటర్నేషనల్ నెట్‌వర్క్!

- **నిరసనల వెనుక ఇంటర్నేషనల్ నెట్‌వర్క్!**
- **ఫాక్స్ న్యూస్ దర్యాప్తు నివేదికలో సంచలన ఆరోపణలు**
- **9 దేశాల్లోని 101 సంస్థల మధ్య లింకులు**
- **ఫ్రాన్స్ అల్లర్లు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా నిరసనల ప్రస్తావన**
- **చైనాకు చెందిన నెవిల్ రాయ్ సింగమ్ నిధులు**
- **ఐఏపీ, కోడ్‌పింక్ సంస్థల పాత్రపై కీలక వివరాలు**

హైదరాబాద్, అక్టోబర్ 22 :: అంతర్జాతీయ నిరసనల వెనుక పలు దేశాలకు విస్తరించిన సంస్థల నెట్‌వర్క్ ఉందంటూ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన దర్యాప్తు కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనల మధ్య సంబంధాలున్నాయని ఆ కథనం సంచలన ఆరోపణలు చేసింది. తొమ్మిది దేశాల్లోని 101 సంస్థలు నిరసనలకు మద్దతు ఇవ్వడం, వాటిని నిర్వహించడం, ప్రచారం చేయడంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని వెల్లడించింది.

'రెడ్-గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'..

ఫాక్స్ న్యూస్ సీనియర్ ఎడిటర్ అస్రా నోమానీ రూపొందించిన 'గ్లోబల్ ఖయాస్ ఇంక్ గ్రోస్ టు 101 గ్రూప్స్' నివేదికలో ఈ వ్యవస్థను 'రెడ్-గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'గా అభివర్ణించారు. కమ్యూనిస్టు, ఇస్లామిస్ట్ భావజాలాలతో సంబంధాలున్నాయని నివేదిక పేర్కొన్న కొన్ని సంస్థలతో పాటు కార్మిక, విద్యార్థి సంఘాలు, ప్రచార నెట్‌వర్క్‌లు, మీడియా సంస్థలు కూడా ఈ వ్యవస్థలో భాగంగా ఉన్నాయని ఆరోపించింది. అమెరికా, బ్రిటన్, గ్రీస్, బ్రెజిల్, భారత్ సహా పలు దేశాలకు ఈ నెట్‌వర్క్ విస్తరించిందని స్పష్టం చేసింది.

ఇండియన్ అలయన్స్ పారిస్ పాత్ర..

ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఇండియన్ అలయన్స్ పారిస్ (ఐఏపీ)' సంస్థను నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఫ్రాన్స్, భారత్‌లోని నిరసనలకు సంబంధించిన సందేశాలను అనుసంధానించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఆరోపించింది. న్యూయార్క్‌లోని పీపుల్స్ ఫోరమ్‌తోనూ దీనికి భాగస్వామ్యం ఉన్నట్లు పేర్కొంది. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ అక్టోబరు 16న తన వెబ్‌సైట్‌లో ప్రచురించిన కథనంలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్, అల్బేనియాల్లో జరుగుతున్న నిరసనలను ఒకే సందర్భంలో ప్రస్తావించిన విషయాన్ని కూడా నివేదిక ఉదహరించింది.



విదేశీ నిధులు.. సింగమ్ లింక్స్..

యూరప్‌లోని నిరసనలకు కమ్యూనిస్టు భావజాలంతో సంబంధాలున్న సంస్థలు మద్దతు ఇస్తున్నాయని అస్రా నోమానీ నివేదిక పేర్కొంది. బ్రేక్‌త్రూ న్యూస్, కోడ్‌పింక్, పార్టీ ఫర్ సోషలిజం అండ్ లిబరేషన్ సంస్థల పేర్లను ప్రస్తావించింది. చైనాలో నివసిస్తున్న అమెరికాలో జన్మించిన వ్యాపారవేత్త నెవిల్ రాయ్ సింగమ్ ఈ సంస్థలకు నిధులు లేదా ఇతర రూపాల్లో మద్దతు అందిస్తున్నారని ఆరోపించింది. కోడ్‌పింక్ వ్యవస్థాపకురాలు జోడీ ఇవాన్స్ అక్టోబరు 14న బ్రేక్‌త్రూ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్‌లో జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ.. ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చినట్లు నివేదిక తెలిపింది. ఐఏపీ కార్యదర్శి, భారత సంతతికి చెందిన జర్నలిస్టు జాయ్ బెనర్జీకి ఫ్రెంచ్ కార్మిక సంఘం సీజీటీతో గతంలో సంబంధాలు ఉండటంతో పాటు, ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీతోనూ అనుబంధం ఉందని కథనం ఆరోపించింది.

ఎమ్మెల్సీ, సింగరేణి ఎన్నికలపై బీఆర్ఎస్ సమరశంఖం!

- రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జిల నియామకం
- అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి
- కార్మికుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- సింగరేణి టెండర్లలో కాంగ్రెస్ సర్కార్ అవకతవకలను ఎండగట్టాలి
- తెలంగాణ భవన్‌లో నేతలతో కేటీఆర్ కీలక సమీక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 22 :: రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ కదనరంగంలోకి దూకింది. ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గులాబీ దళం.. క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేసేందుకు వ్యూహరచన చేసింది. గురువారం తెలంగాణ భవన్‌లో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. ముందుగా ఖమ్మం- వరంగల్- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ఇన్‌ఛార్జిలను నియమించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను ఏకం చేస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని కేటీఆర్ ఇన్‌ఛార్జిలను ఆదేశించారు.

కార్మికుల హక్కుల విషయంలో రాజీ లేదు..

మరోవైపు సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ నుంచి కాపాడటంతో పాటు కార్మికుల హక్కులు, సంక్షేమ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. గోదావరిఖనిలో సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో.. సింగరేణి ప్రాంత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. సింగరేణి ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అక్రమాల ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధుల అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలపై కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలను నిలదీయాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలో చేసిన మేలు వివరించాలి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందించిన లాభాల వాటా, కారుణ్య ఉద్యోగాలు, వైద్య సదుపాయాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ నేతలకు సూచించారు. కార్మికులకు రావాల్సిన బోనస్, ఇతర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వెంటనే ప్రశ్నించాలన్నారు. త్వరలో జరగనున్న సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ, టీబీజీకేఎస్ నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని, సంఘం బలోపేతానికి విశేష కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజిరెడ్డి, కాపు కృష్ణ, ప్రభాకర్ రావు, వీరభద్రం, గడప రాజయ్య, నాగేల్లి వెంకటేశ్వర్లు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకే హనీట్రాప్ వల!

- అందమైన అమ్మాయిల పేరుతో 47 నకిలీ ఖాతాలు
- బుక్కైన 82 మంది పోలీసులు.. వెయ్యికి పైగా బాధితులు
- ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిలింగ్.. లక్షల్లో వసూళ్లు
- డీఐ బాలస్వామికి కుచ్చుటోపీ.. ప్రధాన నిందితుడు పవన్‌కుమార్ అరెస్ట్



హైదరాబాద్, అక్టోబర్ 22 :: అందమైన అమ్మాయిల పేరుతో సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుని, తీయని మాటలతో నమ్మించి, ఆపై ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అంతర్రాష్ట్ర హనీట్రాప్ ముఠా గుట్టును హైదరాబాద్ సిటీ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కొండబత్తుల పవన్‌కుమార్ రావును అరెస్టు చేశారు. సామాన్యులనే కాకుండా చట్టాన్ని కాపాడే పోలీసు అధికారులనూ లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా ఉచ్చులో ఏకంగా 82 మంది పోలీసులు చిక్కినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఓ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోల్పోయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉండగా, మరో ఏసీపీ విచారణను ఎదుర్కొంటున్నారు. బాధితుల సంఖ్య వెయ్యికి పైగా ఉండగా.. ఈ నెట్‌వర్క్ ఏకంగా నాలుగు దేశాలకు విస్తరించినట్లు పోలీసులు గుర్తించారు.

నకిలీ ఖాతాలతో వల.. వీడియోలతో బెదిరింపులు..

పోలీసుల విచారణలో పవన్‌కుమార్ తన మాజీ ప్రియురాలితో కలిసి ఈ దందా సాగించినట్లు తేలింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 33, ఫేస్‌బుక్‌లో 14 నకిలీ ఖాతాలను సృష్టించి, వాటికి అందమైన అమ్మాయిల ఫొటోలను ప్రొఫైల్ చిత్రాలుగా పెట్టేవాడు. ప్రధానంగా పోలీసు అధికారులకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, పరిచయం పెరిగిన తర్వాత శృంగారపరమైన సంభాషణలకు తెరతీసేవాడు. వీడియో కాల్స్ సమయంలో బాధితుల ప్రైవేట్ దృశ్యాలను రికార్డు చేసి, వాటిని మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగేవాడు. వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగాలు పోయేలా చేస్తామని భయపెట్టి డబ్బులు వసూలు చేసేవాడు. తాము మాట్లాడుతున్నది అమ్మాయి కాదని తెలిసిన తర్వాత కూడా కొందరు అధికారులు అతనితో చాటింగ్ కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు.

డీఐ బాలస్వామికి పెళ్లి పేరుతో టోకరా..

ఈ వ్యవహారంలో ఖైరతాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) బాలస్వామి ఉదంతం సంచలనం రేపింది. పవన్‌కుమార్ 'చందన' అనే పేరుతో నకిలీ ఖాతాను సృష్టించి, ఆమె తన బంధువని, ఆమెతో పెళ్లి జరిపిస్తానని బాలస్వామిని నమ్మించాడు. వాస్తవానికి చందన అనే వ్యక్తి లేకపోయినా, ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోందని చెప్పి వైద్య ఖర్చుల పేరుతో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంతటితో ఆగకుండా బాలస్వామిని భార్యాపిల్లలకు దూరంగా దాదాపు ఆరు నెలలపాటు ఓ లాడ్జిలోనే ఉండేలా చేసి మానసికంగా వేధించినట్లు ఆరోపణలున్నాయి. ఇంటికి వెళితే అక్రమ కేసులు పెట్టి ఉద్యోగం పోగొడతానంటూ బెదిరించినట్లు సమాచారం. బాలస్వామి భార్య గంజి హరిత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలస్వామి ఈ కేసుకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు.

వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలి!

- 'అలాయ్ బలాయ్' వేదికగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు
- రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ కలయిక అన్న దత్తాత్రేయ



హైదరాబాద్, అక్టోబర్ 22 :: భారత దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగిన 'అలాయ్ బలాయ్ ఉ 2026' ఉత్సవాల వేదికగా ఆయన దేశ ప్రగతి, ఐక్యతపై కీలక ప్రసంగం చేశారు. సమాజంలో ఆకలిదప్పులు లేని అభ్యుదయ వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అవినీతికి, అఘాయిత్యాలకు ఏమాత్రం తావులేని విధంగా భారత దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

గతంలో భారతీయుల మధ్య ఉన్న చిన్నపాటి విభేదాలను, లొసుగులను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని సుదీర్ఘకాలం పాలించారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఆ క్రమంలో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాటి విభజన రాజకీయాల నుంచి నేర్చుకున్న పాఠాలతో ప్రస్తుత తరుణంలో ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. మనుషుల మధ్య ఉన్న ద్వేషాలను పక్కనబెట్టి ప్రేమను పంచుతూ ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే ఒక గొప్ప సామాజిక వేదిక అలాయ్ బలాయ్ అని ఆయన కొనియాడారు. మానవత్వాన్ని మేల్కొలిపి ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతిని, అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.

ఈ ఏడాది ఇతివృత్తం 'నషా ముక్త్ భారత్'

హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నాయకత్వంలో, అలాయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 20వ వార్షిక ఉత్సవాల్లో ఈసారి 'నషా ముక్త్ భారత్' (వ్యసన రహిత భారతం) అనే ప్రధాన నినాదంతో యువతను చైతన్యపరిచారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలైన బతుకమ్మ, బోనాలు, గిరిజన గుస్సాడీ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో పాటు నోరూరించే తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఈ వేడుకలు అత్యంత కోలాహలంగా సాగాయి. ఈ కార్యక్రమంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, సీనియర్ నేత వి.హనుమంతరావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సహా రాజకీయ, సినిమా, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాయ్ బలాయ్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకో పరిమితమైనది కాదని, ఇది పూర్తిగా సాంస్కృతిక, సామాజిక వేదిక అని బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. భిన్న రాజకీయ భావజాలాలు, విభేదాలు ఉన్నప్పటికీ నాయకులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయతను చాటుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు కళ్ల లాంటివని, ఇరు రాష్ట్రాల ప్రజలు ప్రాంతీయ భేదాలు మరిచి పరస్పర సహకారంతో కలిసికట్టుగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఉత్సవాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' (మత్తు రహిత భారతదేశం) నినాదాన్ని తీసుకున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను కాపాడుకోవడానికి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. వెంకయ్యనాయుడు ఆకాంక్షించినట్లుగానే.. భారత దేశాన్ని 2047 నాటికి 'వికసిత్ భారత్'గా మార్చాలనే సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్నారు. ఆకలి కేకలు లేని అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలని, అవినీతి, అఘాయిత్యాలకు తావులేని విధంగా దేశాన్ని బలోపేతం చేయాలన్నారు. బ్రిటిష్ వారు చేసిన విభజన రాజకీయాల నుంచి పాఠాలు నేర్చుకుని మనమంతా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా అలాయ్ బలాయ్ కార్యక్రమం తెలంగాణ గ్రామీణ కళలకు, జానపద నృత్యాలకు, సంప్రదాయ వంటకాలకు ఒక అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చిందని ఆయన సగర్వంగా ప్రకటించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తుచేశారు.

కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువు!

రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

ఎల్‌నినో ముందస్తు హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం

రాజకీయ కక్షతోనే మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎత్తలేదు

తక్షణమే కరువు మండలాలు ప్రకటించి పరిహారం ఇవ్వాలి

సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

సిద్దిపేట, అక్టోబర్ 22 :: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ వైఫల్యంతోనే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యాలు కారణం కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యమే కారణమని ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువుగా ఆయన అభివర్ణించారు. ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. సకాలంలో సమీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని పేర్కొన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్లు, ఇన్వర్టర్లపై ఆధారపడాల్సి వస్తోందని, కేసీఆర్ పాలనలో దూరమైన కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సమస్యలపై రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదని, ముఖ్యమంత్రిని, విఫలమైన విద్యుత్ శాఖ మంత్రిని అని వ్యాఖ్యానించారు.



మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి రైతులకు పరిహారం అందిస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే మల్లన్నసాగర్‌ను నింపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) కన్నెపల్లి వద్ద మోటార్లు నడిపేందుకు అనుమతించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ వినియోగించుకోలేని ప్రభుత్వ అసమర్థత వల్లే కృత్రిమ కరువు ఏర్పడిందని దుయ్యబట్టారు. రాబోయే 20 రోజులపాటు రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తే మిగిలిన పంటలైనా చేతికొస్తాయన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్



చౌటుప్పల్, అక్టోబర్ 22 :: దసరా సెలవులు ముగిసి ప్రజలు తిరిగి నగరానికి పయనమవడంతో హైదరాబాద్ ఉ విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పండుగ సెలవులు ముగించుకుని సిటీకి వస్తున్న వాహనదారులతో హైవే కిటకిటలాడింది. ముఖ్యంగా చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు ముందుకు కదలక అత్యంత నెమ్మదిగా సాగాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల కోసం ఏకంగా 10 టోల్ బూత్ లను ఓపెన్ చేసినప్పటికీ ట్రాఫిక్ రద్దీని పూర్తిగా నియంత్రించలేకపోయారు. కాగా, దసరా పండుగ సందర్భంగా ఈ పది రోజుల్లో జాతీయ రహదారిపై సుమారు ఏడు లక్షల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అధికారులు వెల్లడించారు. పండుగ రద్దీని ముందే అంచనా వేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్ట్రేలియా పర్యటనకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి!

ఈ నెల 25 నుంచి 30 వరకు సిడ్నీ, మెల్‌బోర్న్‌లలో టూర్

హైదరాబాద్, అక్టోబర్ 22 :: భారత్-ఆస్ట్రేలియా మధ్య గనులు, క్రిటికల్ మినరల్స్, ఆధునిక సాంకేతికత రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఈనెల 25 నుంచి 30 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. దేశంలో పెరుగుతున్న ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ అవసరాలకు అనుగుణంగా క్రిటికల్ మినరల్స్ సరఫరాను పెంచుకోవడం, మైనింగ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. 25న సిడ్నీకి చేరుకోనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. 26న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సిడ్నీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇంటర్నేషనల్ మైనింగ్ అండ్ రిసోర్సెస్ కాన్ఫరెన్స్ (ఐఎంఏఆర్‌సీ)- 2026లో పాల్గొని 'ఇండియా పెవిలియన్'ను ప్రారంభిస్తారు. 27, 28 తేదీల్లో ఆస్ట్రేలియా మంత్రులు మడలైన్ కింగ్, ఆంథనీ చిషోల్మ్‌లతో పాటు మినరల్స్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా, ప్రధాన మైనింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారు. 28న మెల్‌బోర్న్‌లో పబ్లిక్ సెక్టార్ యూనిట్ 'ఎన్‌బీసీసీ' ఆస్ట్రేలియా శాఖను కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు. ఆయన సమక్షంలో ఎన్‌బీసీసీ-గోల్డ్ ఫీల్డ్స్ ఆస్ట్రేలియా మధ్య అవగాహన ఒప్పందం జరగనుంది. అనంతరం ప్రవాస భారతీయులతో భేటీ అవుతారు. 29న మోనాష్ విశ్వవిద్యాలయంలో జరిగే సదస్సులో పాల్గొంటారు. విక్టోరియా ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ (ూబం×వీవీ) శాస్త్రవేత్తలతో పర్యావరణహిత మైనింగ్, పెట్టుబడులు, నూతన సాంకేతికతపై చర్చిస్తారు.

సంపాదకీయం



సౌదీలో బంగ్లాదేశీ జంటకు మరణశిక్ష?

భారతీయుడి ప్రమేయమంటూ ప్రచారం!

మక్కా మసీదులో అనైతిక చర్యల ఆరోపణలతో శిక్ష విధించినట్లు కథనాలు

భారతీయుడే వీడియో తీశాడంటూ పాకిస్తాన్ పోస్టులు

వీడియోతో బెదిరింపులు.. అధికారులకు సమాచారం ఇచ్చాడంటూ ప్రచారం

భారతీయుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారన్న వాదనకు అధికారిక ఆధారాల కొరత

బంగ్లాదేశ్ జంట అరెస్టులపై కుటుంబ సభ్యుల అభ్యంతరాలు

మరణశిక్ష అమలు, భారతీయుడి పాత్రపై స్వతంత్ర నిర్ధారణ అవసరం

సౌదీ అరేబియాలో బంగ్లాదేశ్‌కు చెందిన నజ్రుల్ ఇస్లాం అబ్దుల్ బసీర్, స్వీటీ అక్తర్ అనే ఇద్దరికి మరణశిక్ష అమలు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. మక్కాలోని ఓ మసీదులో అనైతిక చర్యకు పాల్పడ్డారనే అభియోగంపై అక్టోబర్ 14న వీరికి మరణశిక్ష అమలు చేసినట్లు సౌదీ అంతర్గత వ్యవహారాల శాఖ ప్రకటించింది. అయితే, వారు ఏ చర్యకు పాల్పడ్డారనే విషయాన్ని అధికారిక ప్రకటనలో స్పష్టంగా వెల్లడించలేదు. ఇద్దరి మధ్య ఉన్న సంబంధం, శిక్ష అమలు చేసిన విధానంపైనా పూర్తి వివరాలు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ముఖ్యంగా ఓ భారతీయుడు ఈ ఘటనను వీడియో తీసి అధికారులకు అందించాడంటూ పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన కొన్ని సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, భారతీయుడి ప్రమేయాన్ని నిర్ధారించే అధికారిక ఆధారాలు ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు.

భారతీయుడే వీడియో తీశాడా?

అక్టోబర్ 20 నుంచి ప్రచారంలోకి వచ్చిన కొన్ని పోస్టుల ప్రకారం మక్కాలోని మస్జిద్ అల్ హరామ్‌లో క్లీనర్లుగా పనిచేస్తున్న నజ్రుల్, స్వీటీ మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడిందని పేర్కొన్నారు. మసీదులోని 85, 87 గేట్ల మధ్య ఉన్న గదిలో ఇద్దరూ అనైతిక చర్యకు పాల్పడుతున్న సమయంలో ఓ భారతీయుడు వీడియో తీశాడని ప్రచారం చేశారు. అనంతరం ఆ వీడియోతో స్వీటీని బెదిరించేందుకు ప్రయత్నించి, చివరకు సౌదీ అధికారులకు అందించాడని ఆరోపించారు. ఆ భారతీయుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారనే కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఈ వివరాలకు సంబంధించి విశ్వసనీయమైన అధికారిక ధ్రువీకరణ లేదు.

పాకిస్తాన్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

ఈ ఘటనకు సంబంధించిన పలు కథనాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఆ తర్వాత ఇతర దేశాలకు చెందిన ఖాతాల్లోనూ అవే కథనాలు కనిపించాయి. మరోవైపు, బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరి మరణశిక్షకు సంబంధించినవిగా ప్రచారమైన కొన్ని ఫొటోలు, వీడియోలు పాత ఘటనలకు చెందినవని నిజనిర్ధారణ సంస్థలు వెల్లడించాయి. మరణశిక్ష అమలుకు సంబంధించినదిగా ప్రచారమైన ఓ వీడియో 2015 నాటిదని, మక్కాలో తీసినట్లుగా ప్రచారమైన మరో ఫొటో ఈ ఘటనతో సంబంధం లేనిదని తేల్చాయి.

2023 నుంచే సౌదీ నిర్బంధంలో ఇద్దరు

బంగ్లాదేశ్‌లోని ప్రముఖ దినపత్రిక 'ది డైలీ స్టార్' వెల్లడించిన దౌత్య కార్యాలయ పత్రాల ప్రకారం నజ్రుల్ ఇస్లాం, స్వీటీ అక్తర్ 2023 ఆగస్టు నుంచే సౌదీ అధికారుల నిర్బంధంలో ఉన్నారు. నజ్రుల్‌ను ఆగస్టు 1న సైబర్ నేరాల చట్టం కింద అదుపులోకి తీసుకోగా, స్వీటీని మరుసటి రోజు వ్యభిచార ఆరోపణలపై అరెస్టు చేసినట్లు పేర్కొంది. వీరిద్దరూ సౌదీలోని అల్ మజాల్ సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసినట్లు వెల్లడైంది. అయితే, వారిపై మరణశిక్ష పెండింగ్‌లో ఉన్నట్లు దౌత్య కార్యాలయానికి అందిన ఖైదీల జాబితాలో సమాచారం లేదని కథనాలు పేర్కొన్నాయి.

పూర్తి వివరాలు కోరిన బంగ్లాదేశ్

మరణశిక్ష అమలుకు దారితీసిన అభియోగాలు, న్యాయ విచారణ, తీర్పు వివరాలను అందించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం సౌదీ అరేబియాను కోరింది. తమ కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలను ఇద్దరి కుటుంబాలు ఖండించాయి. మరణశిక్ష అమలు గురించి ముందస్తు సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశాయి. మరోవైపు, నజ్రుల్, స్వీటీ భార్యాభర్తలనే ప్రచారంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నజ్రుల్‌కు వివాహం కాలేదని ఆయన తండ్రి పేర్కొన్నట్లు నిజనిర్ధారణ కథనాలు వెల్లడించాయి. దీంతో మరణశిక్ష అమలు జరిగిన విషయం నిర్ధారణ అయినప్పటికీ, భారతీయుడి పాత్ర, వైరల్ వీడియోలు, ఇద్దరి మధ్య సంబంధం, అసలు అభియోగాల స్వరూపం వంటి అంశాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

మరో 30 ఏళ్లు కాంగ్రెస్ అధికారానికి దూరమే

- రాహుల్‌పై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు
- మరో 30 ఏళ్లపాటు కాంగ్రెస్ అధికారానికి దూరమేనంటూ వ్యాఖ్యలు
- ప్రజల్లోకి వెళ్లకుండా నిరసనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్న
- ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్, మిత్రపక్షాలకు కౌంటర్
- చొరబాటుదారుల ఓట్లను కాపాడేందుకే ఆరోపణలంటూ విమర్శలు
- ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదని ఎద్దేవా



న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు. "మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి దిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. "గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు. "రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. నేను ఈ ప్రజల మధ్యే నివసిస్తున్నాను" అంటూ విపక్షాల నిరసనలకు అమిత్ షా కౌంటర్ ఇచ్చారు.

పండగ వేళ పసిడి ధరలు పతనం..

వెండి కూడా దిగొచ్చింది!

- బంగారం, వెండి కొనుగోలుదారులకు ఊరట
- హైదరాబాద్‌లో పది గ్రాముల మేలిమి బంగారం రూ.1,47,348
- రూ.2.06 లక్షలకు తగ్గిన కిలో వెండి ధర
- అంతర్జాతీయ మార్కెట్‌లో వారం రోజుల కనిష్ఠానికి పసిడి
- చమురు ధరల సెగతో ద్రవ్యోల్బణ భయాలు.. వడ్డీ రేట్లపై అనిశ్చితి
- ఇతర పెట్టుబడుల వైపు మళ్లుతున్న మదుపర్లు



హైదరాబాద్, అక్టోబర్ 22: బంగారం, వెండి కొనాలనుకునే వారికి తీపివార్త. పండగల వేళ వీటి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులతో ఈ లోహాల ధరలు తగ్గుతున్నాయి. చమురు మంటల భగభగలతో ద్రవ్యోల్బణ భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చనే ప్రచారంతో వాటి గిరాకీ తగ్గుతోంది. గురువారం ఉదయం హైదరాబాద్ విపణిలో మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ. 1,47,348 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2.06 లక్షలకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర నేడు 4089 డాలర్లకు దిగొచ్చింది. దాదాపుగా వారం రోజుల కనిష్ఠాలకు చేరింది. ఇక వెండి కూడా ఔన్సు ధర 56.32 డాలర్లకు పడిపోయింది. గోల్డ్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల ధర రూ. 1.44 లక్షలుగా ఉంది. సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ. 2.03లక్షల వద్ద ట్రేడవుతోంది. పశ్చిమాసియాలో ఘర్షణలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 110.5 డాలర్లపైనే కదలాడుతోంది. సౌదీ అరేబియాలోని అరామ్‌కో సంస్థపై కొనసాగుతున్న హూతీల దాడులు, సరఫరా అంతరాయాలతో ఈ ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చనే అంచనాలున్నాయి. వచ్చేవారం అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లపై ప్రకటన ఉండనుంది. ఈ నేపథ్యంలో రాబడులు లేని బంగారంపై కంటే ఇతర పెట్టుబడుల వైపు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. రూపాయి బలపడటం కూడా మరో కారణం.

సీజేపీ నిరసనతో నాకు సంబంధం లేదు!

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరా

రూ.10 వేల వ్యక్తిగత బాండ్ నోటీసులను సవాల్ చేస్తూ పిటిషన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 22: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన పిలుపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. అక్టోబర్ 16న తనను అదుపులోకి తీసుకున్న తర్వాత రూ. 10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించి శాంతిభద్రతలను కాపాడాలని ఆదేశిస్తూ జారీ చేసిన నోటీసులు ఆమె ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. నేహాబోరా తరుపున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. నేహాబోరా ఎలాంటి నేరాలకు పాల్పడలేదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యల్లో పాల్గొనలేదని ఆయన కోర్టుకు తెలిపారు. హింసను ప్రేరేపించేలా ఆమె ఎలాంటి పిలుపుఇవ్వలేదని వాదించారు. అక్టోబర్ 16న తిరంగా యాత్ర సమయంలో మండీ హౌజ్ వద్ద నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు విడుదలైన ఆమెకు అక్టోబర్ 18న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నుంచి నోటీసు అందింది. రూ.10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని, శాంతిభద్రతలను కాపాడాలని అందులో ఆదేశించారు. జంతర్ మంతర్‌ను అధికారికి నిరసన స్థలం నుంచి తొలగించినప్పటికీ, ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజల్ని కన్నాట్‌ప్లేస్ వైపు వెళ్లేలా నేహా బోరా ప్రేరేపించారని నోటీసుల్లో ఆరోపించారు. అయితే, నేహా బోరాను మండీ హౌజ్ చేరుకున్న 10-15 నిమిషాల్లోపే అదుపులోకి తీసుకున్నారని ఆమె న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ రోజు శాంతిభద్రతలకు భంగం కలిగిచేలా ఎలాంటి చర్యలకు పాల్పడలేదని వాదించారు. మండీ హౌజ్‌లో కలుద్దామని నేహా బోరా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులో, ఎలాంటి హింసకు పిలుపునివ్వలేదని, ప్రజాశాంతికి విఘాతం కలిగించే ఉద్దేశం కనిపించడం లేదని న్యాయవాది పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు ఉన్నాయని, మండీ హౌజ్ ప్రాంతాలు ఆ పరిధిలోకి రావని న్యాయవాది కోర్టుకు తెలిపారు. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన నోటీసుల్ని రద్దు చేయాలని నేహా బోరా తరుపున కోర్టును కోరారు.



జైలు నుంచి బయటకు రాగానే మరో షాక్!

సీజేపీ లీడర్లకు క్రైమ్ బ్రాంచ్ నోటీసులు

తిహార్ జైలు నుంచి విడుదలైన కొద్దిసేపటికే పోలీసుల చర్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: సీజేపీ లీడర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు బుధవారం రాత్రి ఢిల్లీలోని తిహార్ జైలు నుంచి విడుదలైన సంగతి తెలిసిందే. వీరికి ఆ వెంటనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు షాకిచ్చారు. జైలు నుంచి ఇద్దరూ బయటకు వచ్చిన కొద్ది సేపటికే నోటీసులు అందించారు. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ నోటీసులు ఇచ్చారు. అక్టోబర్ 22, గురువారం మధ్యాహ్నం క్రైమ్ బ్రాంచ్ ఆఫీసులో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. బీఎన్ఎస్ సెక్షన్ 233 ప్రకారం జారీ చేసిన నిబంధనల్ని పాటించకపోవడం వల్ల నమోదైన కేసుకు సంబంధించి విచారణకు రావాలని కోరారు. అలాగే, సీజేపీ నిరసన సందర్భంగా జంతర్‌మంతర్ వద్దకు అక్రమంగా దూసుకెళ్లారంటూ కూడా కేసు నమోదైంది. మరో సీజేపీ నేత అజింక్యా షిండేను కూడా పోలీసులు విచారించే అవకాశం ఉంది. ఈ నిరసనల్లో అతడి పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. నిబంధనల్ని ఉల్లంఘించినందుకుగాను.. అక్టోబర్ 13న సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాలతో వారం రోజులు జుడీషియల్ కస్టడీలో ఉంచారు. దీనిలో భాగంగా తిహార్ జైలుకు తరలించారు. బుధవారం వీరికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చెరో రూ.50,000 పూచీకత్తుపై విడుదల చేసింది కోర్టు. అయితే, మరో మూడు రోజుల జుడీషియల్ కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. మళ్లీ కస్టడీ అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. దీంతో బెయిల్‌పై ఇద్దరూ గురువారం సాయంత్రం విడుదలకాగా.. ఆ వెంటనే పోలీసులు మరో నోటీసు జారీ చేశారు.

సౌదీ విమానాశ్రయంపై దాడి

భారతీయుడు మృతి!

దమ్మామ్ విమానాశ్రయంపై దాడితో కలకలం

ఎనిమిది మందికి గాయాలు..



ఇద్దరు భారతీయులు, ఇద్దరు యెమెన్ పౌరులు, ఇద్దరు బంగ్లాదేశ్ పౌరులు, ఒక నేపాల్ వ్యక్తి ఉన్నారు.

దమ్మామ్, అక్టోబర్ 22: సౌదీ అరేబియాపై యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల దాడులు తీవ్రమవుతున్నాయి. దమ్మామ్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒక భారత పౌరుడు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత భారత అధికారులు సంబంధిత మృతుల కుటుంబాలను సంప్రదిస్తున్నారు. మృతుల కుటుంబాలకు, ఆత్మీయులకు భారత అధికారులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అధికారుల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను భారత రాయబార కార్యాలయ అధికారులు సేకరిస్తున్నారు. సౌదీ అధికారుల ప్రకారం.. బుధవారం సాయంత్రం దమ్మామ్ విమానాశ్రయంపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఒక సౌదీ పౌరుడు, ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయినట్లు సౌదీ అరేబియా పౌర విమానయాన సాధారణ ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ దాడిలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో

విద్యార్థి గ్రామ కమిటీల ఏర్పాటు సహకరించాలి



మహాదేవపూర్అక్టోబర్ 22: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కమిటీల ఏర్పాటుకు ఎం ఆర్ పి ఎస్ ఎంఎస్పి, నాయకులు సహకరించాలని అన్నారు మండల ఎంఆర్పిఎస్ బాధ్యులు నాగరాజు. గురువారం రోజు నాగరాజు జారీ చేసిన పత్రిక ప్రకటనలో తెలుపుతూ ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, విద్యార్థి నాయకత్వం బలోపేటానికై మహాదేవపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యార్థి సంఘం గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని, వారి ఆదేశాల అనుసారం మండలంలో విద్యార్థి సంఘాల గ్రామ కమిటీలు ఏర్పాటుకు మండల ఎంఆర్పిఎస్ మరియు ఎం ఎస్ పి నాయకులు సహకరించాలని పేర్కొన్నారు నాగరాజు.

మహాదేవపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫిడెన్స్

ఎల్ నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటాం: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మహాదేవపూర్ అక్టోబర్ 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వీడియో కాన్ఫిడెన్సా ష్ట్రంలోదేశంలో ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు మరియు వర్షపాతంలో లోటు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి ఈరోజు అత్యవసరంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచులు పి ఎస్ సి ఎస్ చైర్మన్ చల్లా తిరుపతి రెడ్డి మండల వ్యవసాయ అధికారులు రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో బిజెపి వార్డు సభ్యురాలికి అవమానం

సమగ్ర విచారణకై ఎంపీడీవోకు ఫిర్యాదు



మహాదేవపూర్అక్టోబర్ 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని మంగళవారం రోజు జరిగిన దసరా ఉత్సవాల్లో భారతీయ జనతా పార్టీ వార్డు సభ్యురాలు కు అవమానించేలా వ్యవహరించడం జరిగిందని పేర్కొంటూ మండల బిజెపి అధ్యక్షుడు రామ్ శెట్టి మనోజ్ మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం రోజు బిజెపి అధ్యక్షుడు మనోజ్ ఎంపీడీవో కు అందించిన ఫిర్యాదులో, బిజెపి వార్డు సభ్యురాల ఫోటోలు స్క్రీన్ పై ప్రదర్శించక పోవడం పై అభ్యంతరం వ్యక్తం చేశారు, పార్టీల మధ్య ప్రజా ప్రతినిధుల మధ్య వివక్ష చూపడం సరికాదని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. దసరా పవిత్ర పండుగ అందరూ కలిసి మెలిసి తెలంగాణ సాంస్కృతిని కాపాడుకుంటూ జరుపుకునే పండుగని అలాంటి సందర్భంలో రాజకీయాలకు తావివ్వకూడదని, ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పేర్కొంటూ, ఇలాంటి సందర్భాలు పునరావతం కాకుండా చూడాలని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని మనోజ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి జనగామ పోచయ్య బిజెపి మండల కార్యదర్శి వల్ల శ్రావణ్ కుమార్ బిజెపి నాయకులు వెంకటేష్ శంకర్ లు ఉన్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎల్బీ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశంకి ఎంఆర్పీఎస్ నాయకుల శుభాకాంక్షలు



ఎల్బీనగర్ అక్టోబర్ 22 :ఎల్బీ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంని ఎంఆర్పీఎస్ , ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశంకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీ నగర్ కో-ఇన్చార్జి మల్లే పోగు రాజు మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోవిందు, హేమంత్ గుప్తా, అనంత సురేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు అనంత నర్సింహా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఫార్ములా రైడ్ గేమ్

- **గూగుల్ ప్లే, యాప్ స్టోర్లో డౌన్లోడ్కు సిద్ధం**
- **భారత్లో అభివృద్ధి చేసిన రేసింగ్ గేమ్.. వేగం, వ్యూహాలు, కెరీర్ ప్రోగ్రెషన్, రియల్టైమ్ మల్టీప్లేయర్ ప్రత్యేకతలు**

హైదరాబాద్, అక్టోబర్ 22 :



హైదరాబాద్కు చెందిన 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ రూపొందించిన మొబైల్ రేసింగ్ గేమ్ 'ఫార్ములా రైడ్' అందుబాటులోకి వచ్చింది. గూగుల్ ప్లే, యాపిల్ యాప్ స్టోర్లలో విడుదలైన ఈ గేమ్ను విడుదల చేసిన మార్కెట్లలో డౌన్లోడ్ చేసుకోవచ్చని సంస్థ వెల్లడించింది. అత్యంత వేగవంతమైన రేసింగ్తో పాటు వ్యూహాత్మక గేమ్ప్లే, కెరీర్లో ముందుకు సాగే అవకాశాలు, రియల్టైమ్ మల్టీప్లేయర్ పోటీలను ఈ గేమ్లో పొందుపరిచారు. సాధారణ గేమింగ్ను ఇష్టపడేవారితో పాటు రేసింగ్ గేమ్స్పై ఆసక్తి ఉన్నవారికి కూడా వినూత్న అనుభూతిని అందించేలా దీనిని రూపొందించారు. భారత్లోనే అభివృద్ధి చేసిన గేమింగ్ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేయాలనే సంస్థ లక్ష్యంలో ఫార్ములా రైడ్ విడుదల మరో కీలక ముందడుగుగా నిలిచింది.

ఆటగాళ్లకు మెరుగైన అనుభూతి అందిస్తాం: ఎల్.ఎం. శంకర్

ఫార్ములా రైడ్ విడుదల తమ సంస్థకు గర్వకారణమని 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.ఎం. శంకర్ తెలిపారు. భారత్ నుంచి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందగల వినూత్నమైన గేమింగ్ అనుభవాలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

వేగవంతమైన రేసింగ్, వ్యూహాలు, కెరీర్ ప్రోగ్రెషన్, రియల్టైమ్ మల్టీప్లేయర్ వంటి అంశాలతో గేమ్ను రూపొందించామని చెప్పారు. ఆటగాళ్ల నుంచి వచ్చే అభిప్రాయాలకు అనుగుణంగా భవిష్యత్తులో కొత్త ఫీచర్లు, కంటెంట్ను అందించే అవకాశాలున్నాయని తెలిపారు. భారత్తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోని ఆటగాళ్లకు ఈ గేమ్ను పరిచయం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

7సీస్ ఎంటర్టైన్మెంట్ గురించి

7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న డిజిటల్ గేమ్స్, ఇంటరాక్టివ్ కంటెంట్ అభివృద్ధి, ప్రచురణ సంస్థ. మొబైల్, పీసీ, వెబ్ ప్లాట్ఫామ్ల కోసం సొంత గేమింగ్ ఉత్పత్తులను రూపొందిస్తోంది. గేమ్ డిజైన్, సాఫ్ట్వేర్ అభివృద్ధి, యానిమేషన్, నాణ్యతా పరీక్షలు, ప్రచురణ, కృత్రిమ మేధస్సు ఆధారిత కంటెంట్ తయారీ వంటి విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

పాల్గొన్న జిల్లా జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడిపల్లి/కలెక్టరేట్, అక్టోబర్ 22 :



తెలంగాణ రాష్ట్రంలో పండుగ సయన్న ముదిరాజ్ జయంతి వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు కలెక్టర్ కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పండుగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ తెలంగాణ తొలి పోరాట యోధులు పండుగ సాయన్న ముదిరాజ్ భారత స్వతంత్రోద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడన్నారు. పండుగ సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి. 35-38 ఏళ్ల వయసులో చంపబడినాడు దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్హుడ్ గా సుపరిచితుడు. ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశముక్ల, అధికారుల, సంపన్నుల ఆస్తులను తీసుకొని, ఇవ్వకపోతే దోచుకుని పేదలకు పంచి రాబిన్హుడ్ లాగా పండుగ సాయన్న కేవలం ధనవంతులను కొట్టి పేదవాళ్లకు పెట్టే పని పెట్టుకోలేదు. పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారాలను, అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి, తన సొంత పాలనా వ్యవస్థను స్థాపించుకొని, ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేశాడు. కానీ ఆధిపత్య శక్తులైన దేశముక్ లు, కరణంపటేళ్లు, భూస్వాములు పథకం వేసి ఆనాటి నిజాం ప్రభుత్వం చేత సాయన్నను చంపించారు. అలాంటి యోధుడు పండుగ సాయన్న పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవ అభినందనీయం అని అన్నారు,ఇలాంటి గొప్ప వ్యక్తి మన పండుగ సాయన్న జయంతి వేడుకలను అక్టోబర్ 22న ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షులు జి రవి ముదిరాజ్ జిల్లాలో వివిధ హోదాలో ఉన్న అన్ని పార్టీల ముదిరాజ్ నాయకులు. మాజీ సర్పంచులు. మాజీ కౌన్సిలర్లు. మాజీ చెర్మెన్లు. అలాగే జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు ముదిరాజ్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,

ఆదివాసీలు లెక్కడ..!

- **జల్ జంగల్ జమీన్,కు కరువైన నివాళ్లు.**
- **జయంతి రోజు మూగబోయిన కొమురం భీం విగ్రహం.**
- **కళకళలాడాల్సిన ఆదివాసీ భవన్ కూడా అమానుషం లోకి.**
- **ఆదివాసీ జయంతి రోజు మాత్రమే కొమురం భీం గుర్తుకొస్తాడా.!**
- **ఆదివాసీ భవిష్యత్తు తరానికి కొమురం భీమ్ ఆశయాలకు ఇదే నా సంకేతం.!**

మహాదేవపూర్అక్టోబర్ 22 :



రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకై పోరాడి తన ప్రాణాలను సైతం ఆదివాసీల కొరకు అంకితం చేసిన కొమురం భీమ్ కు మాత్రం తన జన్మదినం రోజు కార్యక్రమాలు నిర్వహించకుండా, కొమరం భీం విగ్రహానికి నివాళులు అర్పించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగించేలా చేసింది. ప్రత్యేకంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ పలిమెల మండలాల్లో ఎక్కువ శాతం ఆదివాసి ప్రాంతమై ఉండి మహాదేవపూర్ మండల కేంద్రంలో భారీ కొమురం భీం విగ్రహం, ఆదివాసి భవన్ కూడా ఏర్పాటు చేసి ఉంది. కానీ ఆ అడవి బిడ్డల కొరకు కొమరం భీమ్ జీవితంతో పాటు ప్రాణాలను సైతం త్యాగం చేసి కేవలం ఆదివాసీలకు జల్ జంగల్ జమీన్ లక్ష్యంగా తన జీవితం ముగిసినప్పటికీ అక్టోబర్ 22 కొమురం భీం జయంతి రోజు మాత్రం కొమురం భీం విగ్రహానికి నివాళులు అర్పించడం, కొమురం భీం ఆశయ సాధన పోరాటం కొరకు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ ప్రతి ఆదివాసి బిడ్డ ఒక కొమరం భీమ్ లాగా పోరాటి స్ఫూర్తి తమలో నింపుకునేలా ఎంతో ఆనంద ఉత్సవాలతో తెలంగాణలోని ఆదివాసీల వీరుడి జన్మదిన వేడుకలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, మండలంలో కొమురం భీమ్ జన్మదిన వేడుకలు రోజు కొమురం భీం విగ్రహం విల్లపోవడం ఒక గిరిజన విప్లవకారునికి నివాళులు అర్పించే వారు దిక్కు లేకపోయిందా అనే భావన ప్రజల్లో రాక తప్పలేదు.

కళకళలాడాల్సిన ఆదివాసీ భవన్ కూడా అమానుషం లోకి.

అక్టోబర్ 22 ఆసిఫాబాద్ సంకెపల్లి లో ఆదివాసీలకు ఆయుధంగా పుట్టిన కొమరం భీమ్ ఇదే నెల 27వ తేదీ 1940 జోడేఘాట్ అడవుల్లో తన ప్రాణాలను సాయుధ పోలీసుల పోరాటంలో కోల్పోవడం జరిగింది. ఆదివాసీల కొరకు కొమరం భీమ్ కేవలం జంగల్ జమీన్ అందించడమే లక్ష్యంగా నిజాం ఆసిఫ్ జాహీ రాజ్యమే లుతున్న క్రమంలో తన అడవి బిడ్డలు పడుతున్న గుసలపై, పోరాటం ప్రారంభించి అడవి బిడ్డల కొరకు అంతమందించిన కొమరం భీమ్ కు మాత్రం జన్మదినానికి నివాళులు కరువు కావడం ఆదివాసి సంఘాలపై అనేక సవాళ్లు లేవనెత్తక తప్పడం లేదు. ఇదే నెల 27వ తేదీన అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కానీ ఇక్కడ మాత్రం, ఒక వీరుడు పుట్టిన రోజును విస్మరించి వీరుడు అంతమందించిన రోజుకు మాత్రం ఆదివాసీలు ప్రాధాన్యత ఇస్తున్నారు అనే సవాళ్లు తలెత్తక తప్పడం లేదు. వర్ధంతి నిర్వహించుకోవడం సమంజసమే కానీ వర్ధంతి కన్నా జయంతి గొప్పదన్న విషయం కూడా ఆదివాసీలు గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటున్నారు ప్రజలు.ఒక సాధారణ అడిగి బిడ్డగా పుట్టిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి ఇలా వచ్చింది, అస్సాంలో కార్మిక సంఘాలతో పనిచేసి ఉద్యమ స్ఫూర్తి అంకితం చేసుకుని, ఆదివాసీలు ఉద్యమ స్ఫూర్తిని నింపుకునేలా రాంజీ గూండ్ చరిత్రను, తన మనసులో పెట్టుకొని ఆదివాసీల కష్టాలను తీర్చడమే లక్ష్యంగా మొదలైన స్ఫూర్తి, తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషల్లో కొమరం భీమ్ తన పట్టును సాధించి, బ్రిటిష్ వారితో సైతం ఆదివాసీల హక్కుల పోరాటానికి సైతం వెనుకడుగు వేయలేదు, అంతేకాదు 1940 సాయుధ తెలంగాణ పోరాటం కూడా, కొమరం భీమ్ పోరాటం మరింత ఊపిరి పోసింది. ఒకవైపు ఆదివాసీలకే కాకుండా తెలంగాణ సాయుధ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా దక్కన్ ప్రాంత ప్రజలకు కూడా కొమురం భీం నాటి నుండి నేటి వరకు ఒక వీరుడు అని చెప్పక తప్పదు. అలాంటి మహోత్సవ మరియు మహోన్నతమైన వీరుని జన్మదినం నిర్మానుషంగా కొనసాగడం ఆలోచించదగ్గ విషయం. పోరాటయోధుని జన్మదినం రోజు పోరాట స్ఫూర్తిని రాబోయే తరానికి అందించే ఆదివాసి భవన్ కూడా, తాళం తెరవకుండా ఉండడం రాబోయే ఆదివాసి తరాలకు, కొమరం భీం ఆశయ సాధన పోరాట స్ఫూర్తి ఎక్కడి నుండి లభిస్తుంది అనే విషయాన్ని ఆదివాసి యువత ప్రశ్నించాల్సిన అవసరం నేడు ఏర్పడింది.

ఎల్బీ నగర్ ఏసీపీ రవీందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఆర్పీఎస్ నాయకులు

ఎల్బీనగర్ అక్టోబర్ 22 :

ఎల్బీ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవీందర్ రెడ్డిని ఎంఆర్పీఎస్ , ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ రెడ్డితో నాయకులు సమావేశమై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ ఎల్బీ నగర్ కో-ఇన్చార్జి మల్లే పోగు రాజు మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోవిందు హేమంత్ గుప్తా, అనంత సురేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు అనంత నర్సింహా మాదిగ పాల్గొన్నారు.



అమృత సరోవర్ ట్యాంకుల వద్ద ఘనంగా 'స్పెషల్ క్యాంపెయిన్-6'

జలవనరుల పరిరక్షణే ధ్యేయం: సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని జలవనరుల పరిరక్షణ, పరిశుభ్రత, మరియు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా స్థానిక అమృత సరోవర్ ట్యాంకుల వద్ద 'స్పెషల్ క్యాంపెయిన్-6'కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి రాకుండా చూడటంలో అమృత సరోవర్ ట్యాంకులు కీలక పాత్ర



పోషిస్తున్నాయని, వాటిని పరిశుభ్రంగా కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్యాంకుల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం ద్వారా గ్రామం సుందరంగా మారడమే కాకుండా, దోమల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. తద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని, గ్రామ అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం ముందుకు సాగుతోందని సర్పంచ్ స్పష్టం చేశారు.

ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కొండపల్లి రాములు, నల్లబుగా సమయ్య, మహమ్మద్ బిన్ అలీ, గ్రామ ఏఈ శ్రీకాంత్ శ్రీనివాస్ మరియు వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదును బాధితుడికి అందజేత

- **సీసీ కెమెరాల సాయంతో గుర్తింపు**
- **టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**

నారాయణపేట, అక్టోబర్ 22 :

పండుగ షాపింగ్‌కు వచ్చి పోగొట్టుకున్న నగదును సీసీ కెమెరాల సహాయంతో గుర్తించి బాధితుడికి నారాయణపేట పట్టణ పోలీసులు తిరిగి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల18వ తేదీన నారాయణపేట మండలం బోయిన్‌పల్లికి చెందిన దూల నరసప్ప (56) పండుగ సందర్భంగా శ్రీ సత్యనారాయణ చౌరస్తాలోని సోఫీ దుకాణంలో బట్టలు కొనుగోలు చేస్తుండగా, ఆయన వద్ద



ఉన్న రూ.14,900 నగదు గల సంచి పొరపాటున కింద పడిపోయింది. ఆ సంచిని గుర్తుతెలియని వ్యక్తి తీసుకెళ్లడంతో బాధితుడు నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, ఓ మహిళ ఆ సంచిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం కానిస్టేబుల్ రవి చాకచక్యంగా ఆ మహిళను గుర్తించి, ఆమె వద్ద ఉన్న రూ.14,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ రోజు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు దూల నరసప్పకు ఆ నగదును తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో నగదు, విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా వస్తువు పోగొట్టుకున్నా, అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

కలెక్టరేట్ లో పండుగ సాయన్న జయంతి వేడుకలు

నారాయణపేట, అక్టోబర్ 22 :

నిరంకుశ పాలనకు, పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజా యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి హాల్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలపై జరిగిన అణచివేతను ఎదిరించి, పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ధైర్యశాలి పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ ప్రజా వీరుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆయన సేవలు చిరస్మరణీ



యమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ఇలాంటి మహనీయుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ముదిరాజ్ సంఘం నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్, వకీల్ సంతోష్ కుమార్, ఆకుల బాలప్ప, కాకర్ల భీమయ్య, పోషల్ వినోద్, నర్సిములు, పాండు, ఎల్ ఐ సీ లక్ష్మణ్, మల్లేశ్, పోలేమోని గోవింద్, గౌనీ శీను, ఇతర సభ్యులు,ముదిరాజ్ యువజన సంఘం నాయకులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో అతివేగం.. ఘోర రోడ్డు ప్రమాదం..

(మేడిపల్లి అక్టోబర్ 22. :

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పరిధిలోని సీఐ డి.జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ సర్కిల్ వరంగల్ హైవే పిల్లర్ నంబర్ 57 హెచ్ పీ పెట్రోల్ బంక్ వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని, మెండే శంకర్(53) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆయన కుమారుడు సాయి శివ (30) అతని భార్య మేఘన(28)తో కలిసి టివిస్ 08ఈఆర్7435 (ఐ10) నంబరు గల కారులో ఎల్‌బీ నగర్ నుండి వరంగల్ జిల్లా నర్సంపేటకు వెళుతుండగా పీర్జాదీగూడ హైవే పిల్లర్ నంబర్ 57 సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వెనక నుంచి వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు అతివేగంగా ఢీకొట్టడంతో ముందున్న కారు పల్టీలు కొట్టగా...ఫార్చ్యూనర్ కారు ముందుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు కారులో ఉన్న సాయిశివ, అతని భార్య మేఘన గాయపడగా వారిని చికిత్స నిమిత్తం చైతన్య పురిలోని ఓజోన్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి



కారణమైన ఫార్చ్యూనర్ కారు నడిపిన వ్యక్తిని అకున్ సబర్వాల్, తండ్రి మంగీలాల్ గా గుర్తించారు. సదరు వ్యక్తి మద్యం సేవించి ఉన్నట్లు అనుమానం వ్యక్తమవడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ గురించి అడిగినప్పుడు తన వద్ద లేదని తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఫార్చ్యూనర్ కారుకు అమర్చిన నంబర్ ప్లేట్ నకిలీదిగా గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం నడపడానికి అనుమతించినందుకు వాహన యజమాని మంగీలాల్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



40వ వార్డులో టీడీపీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ విస్తృత ప్రచారం

పరిటాల శ్రీరామ్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. ప్రజల ఆదరణతో విజయం సాధిస్తా!

ధర్మవరం, అక్టోబర్ 22 (:

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 40వ వార్డు టీడీపీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వార్డులోని ప్రజలను కలుస్తూ, తనకు మద్దతు తెలిపి విజయం చేకూర్చాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై, పార్టీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే



విధంగా పనిచేస్తానని తెలిపారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తనపై నమ్మకంతో 40వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బీ-ఫామ్ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పరిటాల శ్రీరామ్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. 40వ వార్డులో ప్రజల ఆదరాభిమానాలతో తప్పకుండా విజయం సాధించి, పార్టీ నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆదినారాయణ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో గెలుపొందడమే తన లక్ష్యమని, వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని వార్డు ఓటర్లను ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కృష్ణగిరిలో టీడీపీ–వైసీపీ ఘర్షణ..

- **పోలీస్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయం!**
- **ఎంపీపీ, జడ్పీటీసీ నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత..**

కృష్ణగిరి, అక్టోబర్ 22 :



కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి మండలంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎంపీపీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఇరువర్గాల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, అది ఘర్షణకు దారితీసినట్లు సమాచారం. ఈ ఘటనలో కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాఘవేంద్ర ప్రసాద్ తలకు గాయమైంది. గాయపడిన కానిస్టేబుల్‌కు వైద్యులు చికిత్స అందించగా, తలకు ఆరు కుట్లు వేసినట్లు తెలిసింది. నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాజకీయ వర్గాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగాల్సిన సమయంలో ఘర్షణ చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామి నేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు అక్టోబర్ 22, :



కర్నూలు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణం లో కొనసాగుతోందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు తెలిపారు. ఈ సందర్భంగా గురు వారం కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని, భద్రతా ఏర్పాట్లను కర్నూలు ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ వారు మీడియా తో మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియకు 26 కేంద్రాలు, జెడ్పీ టీసీ ప్రక్రియకు జెడ్పీ కార్యాల యంలో ఒక కేంద్రం కలిపి మొత్తం 27 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతోందన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్ ల ప్రక్రియ కొనసాగు తుందన్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడం తో అభ్యర్థులు సరైన ధ్రువప త్రాలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. నామినే షన్ కేంద్రాల వద్ద సీసీటీవీ, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచామని చెప్పారు. నామినే షన్ కేంద్రాల వద్ద 100 మీటర్లు, 300 మీటర్ల పరిధిలో కటాఫ్ పాయింట్లు ఏర్పాటు చేశామ న్నారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉన్నందున ఎవరూ గుమిగూడ కూడదని హెచ్చరించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరికి మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, నిబంధనలు ఉల్లం ఘనలు జరగకుండా కఠిన చర్య లు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ వారితో పాటు సీఐలు తేజమూర్తి, శ్రీధర్ మరియు పలువురు ఎస్ఐలు పాల్గొ న్నారు.

వైసీపీ కార్యకర్తలపై మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న వర్గీయుల దాడి

సాకే చంద్రశేఖర్

అనంతపురం అక్టోబర్ 22 :



అనంతపురం పట్టణం 39వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న వర్గీయులు వైయస్సార్ అభ్యర్థి పై దాడి చేశారని సాకే చంద్రశేఖర్ ఆరోపించారు. వైయస్సార్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కర్రతో వైసిపి కార్యకర్తపై దాడి చేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైయస్సార్ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తల తలకు తీవ్ర గాయాలు అయ్యాయని బాధితులను అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డివిజన్లో తెలుగుదేశం పార్టీ ఓటమి భయంతోనే దాడులకు తెగబడుతిందన్న వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, 39వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సాకే చంద్రశేఖర్.బాధితులను ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించిన వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ అభ్యర్థి సి.రమేష్, సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి.

ప్రశాంతంగా ముగిసిన దేవరగట్టు బన్ని ఉత్సవం

భద్రతా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, అక్టోబర్ 22 :



కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో బుధవారం రాత్రి ప్రారంభమైన బన్ని ఉత్సవం గురువారం ఉదయం ముగిసింది. ఉత్సవాన్ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. గతంతో పోలిస్తే గాయాల సంఖ్య తగ్గించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయ శర్మ, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ ఐలు, ఎస్ ఐలు, ఆర్ ఎస్ ఐలు, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

రామారెడ్డి మండల వ్యవసాయ అధికారులు



రామారెడ్డి, :రామారెడ్డి మండలంలో వరి పంట కోత దశలో కంకులను కత్తిరించి నేలపై పడవేసే పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రామారెడ్డి మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ, వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ సూచించారు. వరి పొలాల్లో కంకులు కత్తిరించబడి నేలపై పడిపోతున్నట్లు గుర్తిస్తే, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో మొక్కల మొదళ్ల వద్ద, నేలపై పురుగుల ఉనికిని పరిశీలించాలని తెలిపారు. పురుగు ఉధృతిని బట్టి సరైన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

పురుగు నివారణకు సూచించిన పురుగుమందులు

- పురుగు గుర్తింపు, ఉధృతిని బట్టి కింది మందుల్లో తగినదాన్ని ఎంపిక చేసుకోవాలి.
- ఎమామెక్టిన్ బెంజోయేట్ – (0.4 గ్రాములు/ లీటరు నీటికి),. క్లోరాంట్రానిలిప్రోల్ – 0.3 మి. లీ./లీటరు నీటికి,
- ప్రోపినోఫాస్ –2 మి. లీ./లీటరు నీటికి,
- నోవలురోన్+ఏమమెక్టిన్ బెన్జోఏట్ –1.5 మీ. లీ/లీటరు నీటికి

రైతులు పై మందుల్లో ఏదో ఒకదానిని మాత్రమే ఉపయోగించాలని, సంబంధిత ఉత్పత్తి లేబుల్‌లో వరి పంటకు, గుర్తించిన పురుగుకు సూచించిన మోతాదును నిర్ధారించుకున్న తర్వాతే పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. పంట కోత దశలో ఉన్నందునపురుగుమందుల వినియోగానికి సంబంధించి కోతకు ముందు పాటించాల్సిన విరామాన్ని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రైతులు తమ పొలాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, పురుగు లక్షణాలను గుర్తించిన వెంటనే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే నిజమైన అభివృద్ధి



వైరా మండలం గరికపాడులో దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ.. సర్టిఫికెట్ల ప్రదానం

ఖమ్మం :గరికపాడు దివ్యాంగులు ఆర్థికంగా స్వావలంబన సాధించి ఆత్మగౌరవంతో జీవించినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు.వైరా మండలం గరికపాడు గ్రామంలోని స్థానిక హైస్కూల్‌లో ఎస్ ఆర్ డి ఎస్– Enable India సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 10 రోజుల పాటు నిర్వహించిన వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన దివ్యాంగులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

రుణాల మంజూరుకు సిఫార్సు చేస్తాం: ఎస్ బి ఐ RSETI డైరెక్టర్

ఈ కార్యక్రమానికి ఎస్ ఆర్ డి ఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన RSETI డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, 10 రోజుల పాటు దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ అందించామని తెలిపారు. శిక్షణ పొందిన వారి దరఖాస్తులను రుణాల కోసం బ్యాంకులకు సిఫార్సు చేస్తామని, అర్హతలు, బ్యాంకు నిబంధనల మేరకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

స్వయం ఉపాధికి సహకారం

పర్పుల్ డీఎన్ఏ సొసైటీ ఇన్‌చార్జి పెనుగొండ ఉపేందర్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతం కావడానికి, సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి తమ సంస్థ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ RSETI ఫ్యాకల్టీ షేక్ వహీద్ పాషా, ఎస్ ఆర్ డి ఎస్ ప్రతినిధి ప్రతాప్, Enable India కమిటీ ప్రతినిధులు, శిక్షణ పొందిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవం

అక్షరం – ఆరోగ్యం – ఆర్థికం స్వేరోస్ మూల సిద్ధాంతాలు: ఉప్పలేటి బాబు స్వేరో

సిద్దిపేట, :



స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు చిలకభత్తిని వీరయ్య, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు, సుప్రీమ్ స్వేరో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సూచనలతో గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గురుకులాల సృష్టికర్త ఎస్.ఆర్. శంకరన్, ఐఏఎస్ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేటలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షులు కోడూరు స్వామి జెండాను ఆవిష్కరించగా, స్వేరో గీతాలాపన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా ఇన్‌చార్జి ఉప్పులేటి బాబు స్వేరో మాట్లాడుతూ, అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే మూల సిద్ధాంతాల ఆధారంగా సమాజంలో సమానత్వం, చైతన్యం, అభివృద్ధిని పెంపొందించడమే స్వేరోస్ నెట్‌వర్క్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.స్వేరోస్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాదని, గురుకుల విద్యార్థులకు మాత్రమే పరిమితమైనది కాదని, తెలంగాణకే పరిమితమైన ఉద్యమం అంతకంటే కాదని ఆయన పేర్కొన్నారు. స్వేరోస్ ఒక భరోసా, ఒక భవిష్యత్తు, ఒక జీవన మార్గం, ఒక ధర్మమని అభివర్ణించారు. అక్షరం–ఆరోగ్యం–ఆర్థికం అనే మహోన్నతమైన, ఆచరణాత్మకమైన, గుణాత్మకమైన సిద్ధాంతాలను నలుదిశలా వ్యాప్తి చేస్తున్న స్వేరో యోధులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ స్వేరోస్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు చుంచు సుధాకర్, కోశాధికారి బాలస్వామి, అధికార ప్రతినిధి రామగల స్వామి, సీనియర్ స్వేరో తుండి సుజయ్, రామగిరి శివ, కొమ్ము మహేష్, ఎరుపుల ప్రదీప్, ఏర్పుల మధు, ఏర్పుల కుమార్, ఎరుపుల రాజు, ఏర్పుల సంజీవ్, కోడూరు జశ్వంత్, ఎరుపుల సిద్ధార్థ, ఎరుపుల రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

పాల్గొన్న జిల్లా జిల్లా కలెక్టర్ మను చౌదరి


మేడిపల్లి/కలెక్టరేట్, అక్టోబర్ 22, :



తెలంగాణ రాష్ట్రంలో పండుగ సయన్న ముదిరాజ్ జయంతి వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు కలెక్టర్ కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పండుగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ తెలంగాణ తొలి పోరాట యోధులు పండుగ సాయన్న ముదిరాజ్ భారత స్వతంత్రోద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడన్నారు. పండుగ సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి. 35–38 ఏళ్ల వయసులో చంపబడినాడు దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్ గా సుపరిచితుడు. ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశముక్ ల, అధికారుల, సంపన్నుల ఆస్తులను తీసుకొని, ఇవ్వకపోతే దోచుకుని పేదలకు పంచి రాబిన్‌హుడ్ లాగా పండుగ సాయన్న కేవలం ధనవంతులను కొట్టి పేదవాళ్లకు పెట్టే పని పెట్టుకోలేదు. పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారాలను, అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి, తన సొంత పాలనా వ్యవస్థను స్థాపించుకొని, ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేశాడు. కానీ ఆధిపత్య శక్తులైన దేశముక్ లు, కరణంపటేళ్లు, భూస్వాములు పథకం వేసి ఆనాటి నిజాం ప్రభుత్వం చేత సాయన్నను చంపించారు. అలాంటి యోధుడు పండుగ సాయన్న పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవ అభినందనీయం అని అన్నారు,ఇలాంటి గొప్ప వ్యక్తి మన పండుగ సాయన్న జయంతి వేడుకలను అక్టోబర్ 22న ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షులు జి రవి ముదిరాజ్ జిల్లాలో వివిధ హోదాలో ఉన్న అన్ని పార్టీల ముదిరాజ్ నాయకులు. మాజీ సర్పంచులు. మాజీ కౌన్సిలర్లు. మాజీ చెర్మెన్లు. అలాగే జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు ముదిరాజ్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,

కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన రామిని వేమారెడ్డి మృతి

కుటుంబాన్ని పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి



ఖమ్మం :ఖమ్మం: కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన రామిని వేమారెడ్డి మరణించారని తెలిసిన వెంటనే పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఈరోజు సింహాద్రి నగర్ లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేమారెడ్డి మరణం తీరని లోటని, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సహాయం అవసరమైతే అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఘనంగా పండగల సాయన్న ముదిరాజ్ జయంతి



శేరిలింగంపల్లి, : తెలంగాణ రాబిన్‌హుడ్ పండగల సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలు రాయదుర్గంలో ఘనంగా జరిగాయి. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాయన్న చిత్రపటానికి నివాళులర్పించి, జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గ్రామంలో నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. పేదల కోసం సాయన్న చేసిన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని, జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని నాయకులు తెలిపారు.

పండుగ సాయన్న జయంతికి హాజరైన మియాపూర్ ముదిరాజ్ సోదరులకు ధన్యవాదాలు



శేరిలింగంపల్లి, : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ వీరుడు పండుగ సాయన్న 174వ జయంతి ఉత్సవాలకు మియాపూర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ముదిరాజ్ సోదరులు హాజరై విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ముదిరాజ్ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. ఉత్సవాలకు హాజరైన ప్రతి ఒక్కరికీ మియాపూర్ ముదిరాజ్ సోదరుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రామారెడ్డి, : రామారెడ్డి మండలం జగదాంబ తండా గ్రామానికి చెందిన రాలబండి నర్సింలు గారి పెద్ద కుమారుడు రాలబండి కళ్యాణ్‌కు 30 సంవత్సరాలు, అతని భార్య లాస్యకు నెల రోజుల క్రితం కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో లాస్య తన కుమార్తె ఆధ్యను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయమై మనస్తాపానికి గురైన కళ్యాణ్ ఈరోజు ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తన తండ్రి నర్సింలు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామారెడ్డి ఎస్సై టి. మురళి తెలిపారు.

ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు

గన్నేరువరం :



గన్నేరువరం మండల కేంద్రంలో గురువారం పండుగ సాయన్న జయంతి ని ఘనంగా నిర్వహించిన ముదిరాజ్ కులస్తులు ఈ సందర్భంగా గన్నేరువరం సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వహించడం ముదిరాజ్ కులస్తులు హర్షం ప్రకటించారు జెండా ఆవిష్కరించి పండుగ రంగన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబారాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గన్నేరువరం సర్పంచ్ రంగనవేణి లచ్చి నర్సు ముదిరాజ్ పాకాల పరశురాం ముదిరాజ్ బోయినీ బాలయ్య ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు

శ్రీ కాలభైరవ స్వామి హుండీ లెక్కింపు



రామారెడ్డి, :శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానం ఇసన్నపల్లి (రామారెడ్డి) గ్రామం మండలం రామారెడ్డి జిల్లా కామారెడ్డి దేవస్థానం యొక్క హుండీ విప్పడం జరిగింది, ఉండే విప్పగా వచ్చిన రూపాయలు 10,45,600/-నాణెములు 79,574/- మొత్తం 11,25,174/-(పదకొండు లక్షల ఇరువది అయిదు వేల ఒక వంద దెబ్బైనలుగు) వెళ్లినవి ఈ యొక్క కార్యక్రమంలో ఇరు గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్లు, చింతల శంకర్ చైర్మన్, ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ, ఆలయ సిబ్బంది, మెంబర్లు , సిహెచ్ బైరయ్య, ఏ గంగరాజం గౌడ్, పెద్ద స్వామి, బి తులసి రామ్ సింగ్, జి పి ఓ విసన్నపల్లి, దేవాదాయ శాఖ పరిశీలకులు కామారెడ్డి జిల్లా సత్యనారాయణ , భక్తులు గ్రామ సేవకులు మహిళలు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన వార్డ్ మెంబర్స్



రామారెడ్డి, : రామారెడి మండల ఎంపిడిఓ నాగేశ్వర్ గుప్తకు మండల వార్డు సభ్యుల కమిటీ కలిసి వార్డు సభ్యుల డిమాండ్స్ అయినటువంటి గౌరవ వేతనం, శిలాఫలకాలపైనా వార్డు సభ్యుల పేర్లు, వారికి తగిన గౌరవం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, వినతి పత్రం అందజేశారు, మా యొక్క డిమాండ్స్ నీ పై అధికారులకు తెలియ చేయాలని కమిటీ వారు చెప్పడం జరిగింది. ఇందులో భాగంగా రామారెడ్డి మండల వార్డు సభ్యుల అధ్యక్షులు చెన్నశెట్టి ప్రశాంత్, అధ్యక్షుడు పిప్పరి లింబాద్రి, ఉపాధ్యక్షులు కరికే సత్యరాజ్, మహిళా విభాగపు అధ్యక్షురాలు ఉమ , కార్యదర్శి రెడ్డి మల్లేష్,సలహాదారులు శ్రీనివాస్ , వార్డు సభ్యులు అయినటువంటి లక్ష్మణ్, నవీన్ , నాయిని లక్ష్మీ, సాయిమొల్ల రమేష్, మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి గ్రామ కమిటీల ఏర్పాటు సహకరించాలి

మహాదేవపూర్అక్టోబర్ 22, : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కమిటీల ఏర్పాటుకు ఎం ఆర్ పి ఎస్ ఎంఎస్పి, నాయకులు సహకరించాలని అన్నారు మండల ఎంఆర్పిఎస్ బాధ్యులు నాగరాజు. గురువారం రోజు నాగరాజు జారీ చేసిన పత్రిక ప్రకటనలో తెలుపుతూ ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, విద్యార్థి నాయకత్వం బలోపేటానికై మహాదేవపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యార్థి సంఘం గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని, వారి ఆదేశాల అనుసారం మండలంలో విద్యార్థి సంఘాల గ్రామ కమిటీలు ఏర్పాటుకు మండల ఎంఆర్పిఎస్ మరియు ఎం ఎస్ పి నాయకులు సహకరించాలని పేర్కొన్నారు నాగరాజు.

మహాదేవపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫిడెన్స్

ఎల్ నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటాం: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మహాదేవపూర్ అక్టోబర్ 28, : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వీడియో కాన్ఫిడెన్సా ష్ట్రంలోదేశంలో ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు మరియు వర్షపాతంలో లోటు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి ఈరోజు అత్యవసరంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచులు పి ఎస్ సి ఎస్ చైర్మన్ చల్లా తిరుపతి రెడ్డి మండల వ్యవసాయ అధికారులు రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో బిజెపి వార్డు సభ్యురాలికి అవమానం

సమగ్ర విచారణకై ఎంపీడీవోకు ఫిర్యాదు

మహాదేవపూర్అక్టోబర్ 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని మంగళవారం రోజు జరిగిన దసరా ఉత్సవాల్లో భారతీయ జనతా పార్టీ వార్డు సభ్యురాలు కు అవమానించేలా వ్యవహరించడం జరిగిందని పేర్కొంటూ మండల బిజెపి అధ్యక్షుడు రామ్ శెట్టి మనోజ్ మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం రోజు బిజెపి అధ్యక్షుడు మనోజ్ ఎంపీడీవో కు అందించిన ఫిర్యాదులో, బిజెపి వార్డు సభ్యురాల ఫోటోలు స్క్రీన్ పై ప్రదర్శించకపోవడం పై అభ్యంతరం వ్యక్తం చేశారు, పార్టీల మధ్య ప్రజా ప్రతినిధుల మధ్య వివక్ష చూపడం సరికాదని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. దసరా పవిత్ర పండుగ అందరూ కలిసి మెలిసి తెలంగాణ సాంస్కృతిని కాపాడుకుంటూ జరుపుకునే పండుగని అలాంటి సందర్భంలో రాజకీయాలకు తావివ్వకూడదని, ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పేర్కొంటూ, ఇలాంటి సందర్భాలు పునరావతం కాకుండా చూడాలని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని మనోజ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి జనగామ పోచయ్య బిజెపి మండల కార్యదర్శి వల్ల శ్రావణ్ కుమార్ బిజెపి నాయకులు వెంకటేష్ శంకర్ లు ఉన్నారు.





ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై.. వామపక్షాల గర్జన

- ముట్టడితో దద్దరిల్లిన ఖమ్మం కలెక్టరేట్
- ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి
- లాటరీ పద్ధతిలోనే ఇళ్లు కేటాయించాలి
- స్థానిక సంస్థల అధికారాలను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరగాలి
- ప్రభుత్వ వైఖరి మారకపోతే ఉద్యమం ఉధృతం
- ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలను ఎండగడుతూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన భారీ ధర్నాలో అఖిల పక్ష పార్టీల నాయకుల ధ్వజం

ఖమ్మం :ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరుగుతున్న అక్రమాలను ఎండగడుతూ, పాలకవర్గాల అహంకారానికి వ్యతిరేకంగా ఎర్రజెండాలు, బీఆర్ఎస్ పార్టీ ఒకే తాటిపైకి వచ్చి గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వేదికగా సాగించిన చారిత్రాత్మక ధర్నా పోరాటం ఖమ్మం కలెక్టరేట్ దద్దరిల్లేలా చేసింది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో సాగుతున్న వివక్షా రాజకీయాలను, అర్హులైన నిరుపేదల పొట్టకొట్టే కుట్రలను ఎండగడుతూ వామపక్షాలు, బీఆర్ఎస్ శ్రేణులు ఉమ్మడిగా సమరశంఖం పూరించాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది సైనికులాంటి కార్యకర్తలు ఎర్రజెండాలను చేతబూని కదం తొక్కుతుంటే, అధికార పీఠం గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ప్రభుత్వ నిర్బంధాలను, వందలాదిగా మోహరించిన పోలీసు బలగాల వలయాలను సైతం లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో కలెక్టరేట్ ముట్టడికి దూసుకెళ్లిన ఆ పీడిత జనాల ఉబికివస్తున్న ఉద్వేగం చూసేవారందరిలోనూ రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. పేదవాడి సొంతింటి కలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కఠిన ప్రభుత్వ వైఖరిపై నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. అర్హులైన పేదలను అణచివేయాలని చూసే పాలక వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించిన నినాదాలు కలెక్టరేట్ గోడల్లో ప్రతిధ్వనించాయి . అన్యాయాన్ని ఎదిరించి నిలబడిన ఆ ప్రజా శంఖారావం నిరుపేదల హక్కుల కోసం ఏ క్షణమైనా వెనకడుగు వేయబోమనే గట్టి హెచ్చరికను అధికార పార్టీకి స్పష్టంగా వినిపించింది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరుగుతున్న అక్రమాలకి, రాజకీయ వివక్షతకు చరమగీతం పాడే వరకు ఈ పోరాటం ఆగదనే అచంచల విశ్వాసాన్ని వామ పక్షాల ఐక్య పోరాటం చాటిచెప్పింది. పోలీసుల మోహరింపులు, ముందస్తు ఆంక్షలు ఆ ఎర్ర దండు ముందు తలవంచక తప్పలేదు. నిరుపేదల ఆవేదనను, ఆక్రోశాన్ని కలెక్టర్ ముందు ఉంచి వామపక్ష, బీఆర్ఎస్ నాయకులు చేసిన ఈ గర్జన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కంటే ఏ శక్తీ గొప్పది కాదని మరోసారి రుజువు చేసింది.

వామపక్షాల గర్జన.. చట్ట బద్ధత లేని ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి : నున్నా నాగేశ్వరరావు

ఈ సందర్భంగా సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాపాలన పేరుతో లబ్ధిదారులను ఎంపిక చేసినా, ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకు అతీతంగా వేస్తామని చెప్పి ఏ గ్రామంలోనూ కాంగ్రెస్ వారు కాకుండా ఇంకెవరికీ చోటు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కమిటీలకు ఎలాంటి చట్టబద్ధత లేకపోయినా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన లీస్ట్ ప్రకారమే అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ జాబితాలు తయారు చేసి చివరకు అసలు దరఖాస్తు చేసుకోని వారికి, జాబితాలో లేని వారికి కూడా ఇష్టానుసారంగా ఇళ్లు కేటాయిస్తున్నారని, కాంగ్రెస్ కనుసన్నల్లో ఉన్నవారికే ఇస్తామంటూ పేదల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. ఈ ఇందిరమ్మ పథకానికి ఇస్తున్న నిధులు కాంగ్రెస్ పార్టీవి కాదని, ప్రజల సొమ్మని గుర్తుచేశారు. కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు, ఎంపీలు సొంతంగా పరిశీలన చేయకుండా కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన లిస్టులకే అప్రూవల్ ఇస్తున్నారని, అధికారులు రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల ఎంపిక అధికారాలు పూర్తిగా గ్రామసభలు, పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు ప్రజలకు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీల ద్వారా గెలిచిన సర్పంచులను కనీసం గౌరవించకపోవడం, పరిగణలోకి తీసుకోకపోవడం అప్రజాస్వామికమని అన్నారు. గతంలో రాజీవ్ గాంధీ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు ఎన్నో అధికారాలు కల్పిస్తే, నేడు ఆ అధికారాలను స్థానిక సంస్థలకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరైనది కాదని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాలలో సర్పంచులుగా గెలిచిన ప్రతిపక్ష పార్టీల నాయకులను కనీసం లెక్కచేయకుండా, కోట్లు ఖర్చు పెట్టిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ పక్షపాతం వీడి అర్హులైన పేదలందరికీ కుల, మత, పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని, ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

లోపాలను ప్రభుత్వం సరిచేసుకోవాలి :దండి సురేష్

సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రసంగిస్తూ ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జరుగుతున్న లోపాలను ప్రభుత్వం సరిచేసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను, స్థానిక సంస్థల ప్రతినిధుల అధికారాలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.

దుర్మార్గమైన కాంగ్రెస్ పాలన:తాతా మధు

ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు లేదా పార్టీ కండువా కప్పుకున్న వారికే ఇళ్లు కేటాయిస్తూ దుర్మార్గమైన పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల సర్పంచుల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు గ్రామ సచివాలయాలను పక్కనబెట్టి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ రాజకీయాలకు అతీతంగా లాటరీ పద్ధతిలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీలో ఉన్నవాళ్లే ప్రజలా?: కందాల

పాలేరు మాజీ ఎమ్మెల్యే కే ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, మాది ప్రజాప్రభుత్వం, పేదల ప్రభుత్వం, ఇందిరమ్మ ప్రభుత్వం అని స్టాండర్డ్ డైలాగులు పేపర్లలో చూస్తుంటారని, కానీ ఇందిరమ్మ ప్రభుత్వమో, పేదల ప్రభుత్వమో అనుకుంటే ప్రజలు అంటే ఓన్లీ కాంగ్రెస్ పార్టీలో ఉన్నవాళ్లే ప్రజలా, వీళ్ళు కొత్త నిర్వచనాలు, వివాదాలు సృష్టిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆగ్రహానికి గురికాక ముందే వీటన్నింటిని సరిచేసి, నిజంగా అర్హులైన పేదవాళ్లకు, అందరికీ ఒకేసారి ఇవ్వలేకపోవచ్చు కానీ అర్హులైన వాళ్లకు ముందుగా, నిజంగా ఎక్కువ మంది ఉండేటట్లు ద్రా తీసి అయినా కచ్చితంగా అందరికీ న్యాయం చేయాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా చేయాలని ఆయన పేర్కొన్నారు.తాము గతంలో సొంత పైసలతో, పది మందికి సహాయం చేస్తూ కూడా ఎక్కడా పార్టీ అని ఆలోచించలేదని, అన్ని పార్టీల వాళ్లకు, ఏ పార్టీ భేదం లేకుండా అందరికీ సహాయం చేశామని ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

మంత్రులు చెప్పేదొకటి, ఆచరణలో మరొకటా! : భాగం

సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర మంత్రులు చెప్పేదొకటి, ఆచరణలో జరుగుతున్నది మరొకటని ఆయన మండిపడ్డారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇందిరమ్మ ఇళ్లు రాజకీయాలకు అతీతంగా పేదవాళ్లందరికీ ఇస్తామని ప్రతిరోజూ సమావేశాల్లో చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోందని ఆరోపించారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ లబ్ధిదారుల ఎంపికలో మొదటి, రెండో విడతల్లో అర్హులైన వారందరికీ ఇస్తామని చెప్పి, మూడేళ్ల కాలంలో పేదవాడికి ఇల్లు లేకుండా చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ఆచరణలో మాత్రం విస్మరిస్తున్నారని విమర్శించారు. లాటరీ ద్వారా రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేలా పోరాటం : సండ్ర

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ కమిటీల రద్దు, న్యాయమైన లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేలా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటేనే ఇళ్లు ఇస్తామని బెదిరింపులకు దిగుతున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ రకమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

దేశవ్యాప్తంగా రాజ్యాంగం పుస్తకం చేతపట్టుకుని తిరిగే కాంగ్రెస్ నాయకులకు, రాహుల్ గాంధీకి తెలంగాణలోని నిరుపేదల రాజ్యాంగ హక్కులు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో కఠినమైన నిబంధనలు అమలు చేసి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం విఫలం

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 వాగ్దానాలలో అన్ని వాగ్దానాలు విఫలమయ్యాయని,, ఇందిరమ్మ ఇండ్ల పథకం కూడా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలోకి వచ్చాక చేసిన పాలనలో కూడా నైతికత లేదని, ఆయన ప్రభుత్వం కూడా నూటికి నూరు శాతం విఫలమై ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమం లో సీపీఎం నాయకులు యర్రా శ్రీనివాసరావు,బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు తో పాటు ఇతర వామ పక్ష పార్టీల నేతలు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కు వినతిపత్రం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ను అఖిల పక్ష నాయకులు కలిసి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు, రాజకీయ వివక్ష ను వివరించి, వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు,మాజీ ఎమ్మెల్యే లు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి తో పాటు సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సీ వై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





మధ్యాహ్న భోజన పథకంలో నిర్లక్ష్యం.. ఇన్ చార్జి హెచ్ ఎం సస్పెండ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చర్యలు తీసుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 సెప్టెంబరు 15 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. సంబంధిత అధికారులకు అందిన ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. విచారణలో మధ్యాహ్న భోజన పథకం అమలులో అలసత్వం చోటుచేసుకున్నట్లు వెల్లడైంది. విచారణ నివేదికతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రయోజనాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.

రెడ్ క్రాస్ అభివృద్ధికి కృషి చేస్తా



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :

జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు గురువారం నిజామాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ సేవలను మరింత విస్తరించేందుకు తన వంతు తోడ్పాటు ఉంటుందని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ భవనాన్ని సందర్శించాలని కార్యవర్గ సభ్యులు కోరగా.. తప్పకుండా సందర్శిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ డాక్టర్ సీను నాయక్, కోశాధికారి కెంపుల నాగరాజు, కార్యవర్గ సభ్యులు రంజిత్‌సింగ్, జగన్‌మోహన్‌గౌడ్, సభ్యులు పద్మ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ బి. రాజశ్రీ తెలిపారు. శుక్రవారం నగరంలోని అర్సపల్లిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, స్థానిక రైల్వే స్టేషన్ వద్ద కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలో అక్టోబరు 22 నుంచి నవంబరు 4 వరకు 14 రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లాలో సుమారు 21.43 లక్షల జనాభా ఉండగా, అంచనా ప్రకారం 4,73,398 గృహాల్లో ప్రజలు నివసిస్తున్నారని వివరించారు. మొత్తం 1,129 ఆశా బృందాలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తిస్తాయని చెప్పారు. సర్వేను పర్యవేక్షించేందుకు 235 మంది సూపర్‌వైజర్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 37 ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 275 ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్వే పూర్తయిన అనంతరం కొత్తగా గుర్తించిన కుష్టు వ్యాధిగ్రస్తుల జాబితాను రూపొందించి, వారికి అవసరమైన చికిత్స అందిస్తామని డాక్టర్ రాజశ్రీ వెల్లడించారు. వ్యాధిపై అపోహలు వీడి, లక్షణాలు ఉన్నవారు ముందుకొచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ ఉప వైద్యాధికారి డాక్టర్ సికందర్ నాయక్, డీఎన్‌ఎంఓ డాక్టర్ భార్గవి జోషి, అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అజ్మతున్నీసా, డాక్టర్ చంద్రకళ, పీఎంఓ రూప, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ నాగరాజు, మహిళలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అలయ్ బలయ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :



అలయ్ బలయ్ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దసరా సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వాతావరణంలో కలుసుకునేలా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం స్ఫూర్తిదాయకమ న్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు.

పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- **జయంతి వేడుకల్లో**
- **ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి**





నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :

అణగారిన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, చూపిన తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పండుగ సాయన్న 174వ జయంతిని గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే. ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పండుగ సాయన్న ఒక వ్యక్తిగా కాకుండా మహాశక్తిగా ఎదిగి, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీరుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించేందుకు కులగణన చేపట్టిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు మేయర్, చైర్మన్ పదవులు 53 శాతం కేటాయించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ముదిరాజ్‌లు పండుగ సాయన్న స్ఫూర్తితో రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. భూస్వాములు, జమిందార్ల ఆగడాలు అధికంగా ఉన్న రోజుల్లోనే పండుగ సాయన్న బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన పోరాటం గొప్పదన్నారు. ఈ నేపథ్యంలో పండుగ సాయన్న జయంతిని అధికారికంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సాయికుమార్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, బి. రామకృష్ణ, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కే. రమేష్, మెతుకు శివ, రవిరాజ్, నారాయణ, బీసీ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.లక్ష కోట్లు నీటిపాలు.. రైతులకు తీరని నష్టం

- **కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పై ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శలు**
- **మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై అసంతృప్తి..**
- **వచ్చే వారం ఆందోళనలకు హెచ్చరిక**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వరంగా మారుతుందని ప్రచారం చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. చివరకు దానిని కుటుంబ రాజకీయాలకు, అవినీతి ఆరోపణలకు కేంద్రంగా మార్చిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. బ్యారేజీల నిర్మాణంలో నాణ్యతా లోపాలు, డిజైన్ల మార్పులు, నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణ కోటి రతనాల వీణ', 'లక్షల ఎకరాల మాగాణి' అంటూ నినాదాలు చేసిన కేసీఆర్ ప్రభుత్వం.. రైతులకు ఎన్నో ఆశలు కల్పించిందని అరవింద్ విమర్శించారు. చివరకు ప్రాజెక్టు పరిస్థితి రైతాంగానికి నష్టాన్ని మిగిల్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సుమారు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంటులో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో తొలుత రూపొందించిన డిజైన్లకు, ఆ తర్వాత అమలు చేసిన విధానాలకు మధ్య తేడాలున్నాయని పేర్కొన్నారు. నిర్మాణ పద్ధతులపై అనేక ప్రశ్నలు తలెత్తాయని చెప్పారు. 2023లోనే బ్యారేజీల్లో సమస్యలు బయటపడినప్పుడు తగిన మరమ్మతులు చేపట్టి ఉంటే పరిస్థితి ఇంత తీవ్రంగా మారేది కాదన్నారు. అప్పటి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు సూచించిన మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలను సకాలంలో చేపట్టడంలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాకపోయినా, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు, పటిష్ఠమైన నీటిపారుదల వ్యవస్థలు అవసరమని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయంతోపాటు వైద్యం, గృహ నిర్మాణ రంగాలు కూడా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అరవింద్ ఆరోపించారు. పంటల సాగు తగ్గించాలని సూచించే ముందు రైతులకు ఎకరాకు రూ.60 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల ప్రణాళిక, సాగునీటి నిర్వహణ, పాత ప్రాజెక్టుల మరమ్మతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మాధవనగర్ ఆర్వోబీపై అసంతృప్తి

నిజామాబాద్‌లో కీలకమైన మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగకపోవడంపై ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2024 అక్టోబరు 22న అదనపు అంచనాలు, డిజైన్ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపినప్పటికీ అనుమతుల విషయంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. బ్లాక్ కాటన్ నేల కారణంగా పునాది డిజైన్‌లో మార్పులు చేయాల్సి రావడంతో సుమారు రూ.9 కోట్ల అదనపు వ్యయం ఏర్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అయినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. భూసేకరణ, పెండింగ్ బిల్లులు, నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోతున్నాయని తెలిపారు. రైల్వే శాఖకు సంబంధించిన పనులు పూర్తయిన చోట రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. బోధన్ ప్రాంతంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంలోనూ అనుమతులు, నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. మాధవనగర్ ఆర్వోబీతోపాటు ఇతర పెండింగ్ పనులపై అధికారులు తక్షణమే స్పందించాలని అరవింద్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే వచ్చే వారం ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం వస్తే పసుపునకు క్వింటాలుకు రూ.50 వేల ధర సాధించి చూపిస్తానని గతంలో హామీ ఇచ్చినట్లు అరవింద్ గుర్తుచేశారు. అవసరమైతే బాండ్ పేపర్లపై రాసి ఇస్తానని కూడా చెప్పానన్నారు. పసుపు రైతుల ప్రయోజనాల కోసం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. సమావేశంలో అర్జున్ ఎమ్మెల్ట్ల సంఘం ప్రతినిధి సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వినేష్ కులాచారి, రాష్ట్ర నాయకులు స్రవంతిరెడ్డి, బీజేష్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళిక

- **యాసంగిలో వరి సాగు వద్దు..**
- **ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి**
- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 :


ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్తు అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్‌లో వరి సాగు చేయకుండా రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వరికి బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. యాసంగిలో వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉండే అవకాశం లేనందున రైతులు ఆ పంటకు దూరంగా ఉండేలా గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తక్కువ నీటితో, స్వల్ప వ్యవధిలో దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు వివరించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. ఆయిల్‌పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని వివరించాలని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేపడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, ముందుగానే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న ఎనిమిది నుంచి పది నెలలకు సంబంధించి గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థితి, విద్యుత్తు వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ పనులపై ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. విద్యుత్తు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. వచ్చే వర్షాకాలం వరకు జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, కొత్త పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని తాగునీటి సరఫరాకు వినియోగించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తూ నీటి సరఫరా వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయపతి కామేశ్వరి

నేడు రేడియో అక్కయ్య వర్ధంతి

న్యాయపతి కామేశ్వరి, రాఘవరావుల గురించి ఈ తరం వారికి ఎక్కువగా తెలియక పోవచ్చు. రేడియో ప్రధాన ప్రసార సాధనంగా, తెలుగు ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకు పోయిన రోజులలో రేడియో 'అక్కయ్య, అన్నయ్య'లుగా ప్రసిద్ధులైన వారిద్దరు, ఆంధ్ర బాలానంద సంఘం పేరుతో 1939-40 నుండి 1955-56 ప్రాంతం వరకు మద్రాసు, ఆ తరువాత హైదరాబాదు నుండి తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ప్రత్యేకంగా వాళ్లిద్దరు కలిసి చేసిన రేడియో కార్యక్రమాలు కొన్ని అజామరాలుగా నిలిచి పోయాయి. వారు రాసి కొంత వరకు బాణీలు కట్టిన కొన్ని పాటలు కంప్యూటర్.ఎం.వి సంస్థ ద్వారా రికార్డులుగా వెలువడ్డాయి. రేడియో అక్కయ్యగా పేరుపొందిన న్యాయపతి కామేశ్వరి (1908 - 1980) విజయ నగరంలోని 1908లో పండితుల, విద్వాంసుల కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖపట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు. ఆ కాలంలో బి.ఎ. ఉత్తీర్ణులైన మొట్టమొదటి మహిళ ఆమే. తరువాత కొంతకాలం నూజివీడు ఎస్టేటులో కపిలేశ్వరపురం జమిందారిణి జగదీశ్వరమ్మలు ఇంగ్లీషు నేర్చారు. 1934లో న్యాయపతి రాఘవరావును వివాహం చేసుకున్నారు. తరువాత 1937లో మద్రాసులోని వెల్లింగ్టన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీ లో ఉపాధ్యాయ శిక్షణ (ఎల్.టి.) పూర్తిచేశారు. ఇద్దరి అభిప్రాయాలు కలియడంతో భర్తకుతోడుగా, చెన్నై రేడియో కార్యక్రమాలలోను, బాల పత్రిక నిర్వహణలోను ఆమె చురుగ్గా పాల్గొన్నారు. చెన్నై ఆకాశవాణి కేంద్రం వారు ఆటవిడుపు పేరుతో పిల్లల కార్యక్రమ నిర్వహణ చేపట్టి, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను న్యాయపతి దంపతులకు అప్పగించారు. ఆ విధంగా ఆమె రేడియో అక్కయ్యగా స్థిర పడి పోయారు. రాఘవరావు ఈమెతో పాటుగా రేడియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూం డటంతో, ఆయనకు రేడియో అన్నయ్యగా పేరొచ్చింది. తరువాత ఈ కార్యక్రమం బాలానందంగా రూపాంతరం చెంది ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా పలు సంవత్సరాలు వారిద్దరిచే నిర్వహించడం జరిగింది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యాయపతి కామేశ్వరి స్త్రీల కార్యక్రమాలకు ప్రయోక్తగా పని చేసేవారు. ఆకాశవాణి హైదరాబాద్ లో పనిచేస్తున్న కామేశ్వరి రేడియోకు అటు పత్రికలకు, రంగస్థలానికి అనేక నాటికలు, కథలు, గేయాలు రాసేవారు. చాలా మంది బాలలను నటులగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. అనేక పల్లె ప్రాంతాలలో రేడియో మహిళా మండలలు ఏర్పాటు కావడానికి కృషి చేశారు. పేద మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడిన స్త్రీ న్యాయపతి కామేశ్వరి. ఆనాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసలను కూడా ఈమె అందుకున్నారు. బొమ్మల కొలువులు ఉత్సవాలు విహార యాత్రలు నిర్వహించే వారు. సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండే ఆమె రచనలలో సహజత్వం ఉట్టిపడేలా ఉండి, సజీవ రూపాలుగా రూపు దిద్దు కున్నవి. కథలు బాలలకు సులభంగా అర్థమై పోతాయి. ఈమె రాసిన కథల్లో " అనగనగా ఆకలి కథ, ఇల్లు ఇరకాటం, ఆ చంద్రం, దోమ కోతి, తాత అవ్వ కథ, అమ్మమ్మ బహుమానం, " కోతి చేష్టలు", నాలుగు ఏనుగుల కథలు ముఖ్యమైనవి. కామేశ్వరి వ్రాసే నాటికలలో ఉన్న పాత్రలు అన్నీ ఆడపిల్లల పాత్రలే ! పిల్లలను చేరదీసి మంచి అలవాట్లు ఏవో, చెడు అలవాట్లు ఏవో కామేశ్వరి విడ మరిచి చెప్పేవారు. ఆంధ్ర బాలానంద సంఘం కార్యక్ర మాల కోసం తన సొంత భవనాన్ని దారాదత్తం చేశారు. కామేశ్వరి ఆశయాల మేరకు మర్రి చెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జవహర్ బాల భవన్ ఏర్పాటు చేశారు. మండలి వెంకట కృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కామేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ స్థాపన జరిగింది. 1975లో తొలి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సందర్భంగా బాల సాహిత్యానికి చేసిన సేవలకు గాను ఆమెను ఘనంగా సత్కరించడమే గాక 1978లో "బాలబంధు" బిరుదుతో ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ వారు సత్కరిం చారు. 1981లో కామేశ్వరి రచనలను అన్నింటినీ కలిపి " భోగి పళ్ళు " అనే సంకలనంగా తెచ్చారు. బాలానంద మహోద్యమానికి భర్త న్యాయపతి రాఘవ రావుకు సర్వవిధాలా సహకరిం చిన కామేశ్వరి తన 72వ ఏట 1980 అక్టోబర్ 23వ తేదీన ఈ లోకం వదిలి వెళ్లారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

సాగేగుణం గల టంగ్‌స్టన్ ఆవిష్కర్త విలియం డి.కూలిడ్జ్

నేడు విలియం డి.కూలిడ్జ్ జయంతి

విలియం డి.కూలిడ్జ్ (అక్టోబరు 23 1873 - ఫిబ్రవరి 3 1975 అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. సాగే గుణం కలిగిన టంగ్‌స్టన్ ఆవిష్కర్త. ఆయన ఎక్స్-కిరణం యంత్రాలపై అనేక ప్రయోగాలు చేశారు. ఆయన జనరల్ ఎలక్ట్రిక్ రీసెర్చ్ లాబొ రేటరీకి డైరక్టర్ గా పనిచేశారు, కార్పొరేషన్ కు ఉపాధ్యక్షునిగా కూడా ఉన్నారు. ఆయన "సాగే గుణం గల టంగ్‌స్టన్"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి పొందారు. ఈ టంగ్‌స్టన్ విద్యుత్ బల్బులలో ముఖమైన భాగం.

కూలిడ్జ్ మసాచుసెట్ట్స్ యందలి హడ్సన్ సమీపంలోని ప్రదేశంలో జన్మించారు. ఆయన 1891 నుండి 1896 లో మసాచుసెట్ట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరే వరకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివారు. లాబొరేటరీ





అసిస్టెంట్ గా పనిచేసిన సంవత్సరం తరువాత ఆయన జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లారు. అక్కడ డాక్టరేట్లను పొందారు. ఆయన 1899 నుండి 1905 వరకు ఎం.ఐ.టి వద్ద రసాయన శాస్త్ర విభాగంలో గల ఆర్థర్ ఎ నోయ్స్ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్ గా పని చేశారు.

సాగే గుణం గల టంగ్‌స్టన్ కూలిడ్జ్ 1905లో కొత్త పరిశోధనా ప్రయోగ శాలలో జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ వద్ద పరిశోధకునిగా పని చేయటకు వెళ్లారు. అక్కడ ఆయన అనేక ప్రయోగాలను నిర్వహించారు. ఆయన పరిశోధన విద్యుత్ బల్బులలో ఫిలమెంటుగా ఉపయోగించే లోహంగా "టంగ్‌స్టన్" ఉపయోగించుటకు దోహద పడింది. ఆయన టంగ్‌స్టన్ లో సాగేగుణం గలదానిని అభివృద్ధి చేసారు. ఈ పరిశోధన ఫలితంగా విద్యుత్ బల్బులోని ఫిలమెంటును సులువుగా తీగలుగా మలచవచ్చు. దానిని టంగ్‌స్టన్ ఆక్సైడు ద్వారా శుద్ధి చేయవచ్చు. 1911 మొదట్లో "జనరల్ ఎలక్ట్రిక్" ఈ క్రొత్త రకం ఫిలమెంట్ తో బల్బులను మార్కెట్ లో విడుదల చేసింది. దీని ఫలితంగా ఆ సంస్థకు ముఖమైన అదాయ వనరుగా ఈ బల్బుల అమ్మకం దోహద పడింది. ఆయన 1913 లో ఆయన క్రొత్త ఆవిష్కరణకు పేటెంట్ (ఖూచ1,082,933) కొరకు దరఖాస్తు చేసి పొందారు. అదే విధంగా 1928 లో యు.ఎస్. లోని కోర్టు తాను తయారుచేసిన 1913 లోని పేటెంట్ విలువైన ఆవిష్కరణగా గుర్తించింది.

ఎక్స్-కిరణ నాళం అభివృద్ధి

1913 లో ఆయన కూలిడ్జ్ నాళాన్ని ఆవిష్కరణ చేసారు. అభివృద్ధి చెందిన కాథోడుతో కూడిన ఎక్స్-కిరణ నాళం అనేక ఎక్స్ - కిరణ యంత్రాలలో ఉ పయోగించడం వలన శరీరంలో చాలా అంతర భాగాలలో ఉన్న కాన్సర్ కణతులను కూడా కచ్చితంగా గుర్తించుటకు తోడ్పడింది. ఈ కూలిడ్జ్ నాళంలో టంగ్‌స్టన్ను ఫిలమెంట్ గా ఉపయోగిస్తారు. ఇలా ఉపయోగించుట వైద్యరంగం లోని రేడియాలజీ విభాగంలో ప్రముఖ అభివృద్ధికి దోహద పడింది. ఈ నాళం సంబంధిత ప్రాథమిక డిసైన్ ను ప్రస్తుతం కూడా ఉపయోగిస్తున్నారు. ఆయన మొట్ట మొదటి భ్రమణం చేసే ఆనోడు ఎక్స్-కిరణ నాళాన్ని ఆవిష్కరణ చేశారు. ఆయన 1913 లో యు.ఎస్. పేటెంట్ కోసం దరఖాస్తు చేసి 1916 లో పొందారు.

1914 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆయనను రమ్‌ఫోర్డ్ ప్రైజ్ తో సత్కరించింది.

1927 లో అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ ఎడిసన్ మెడల్ ను పొందారు. ఈ మెడల్ ఆయన ప్రకాశించే విద్యుత్ కాంతి, ఎక్స్-కిరణాలు కళ సేవల" కు పొందారు.

1926 లో హోవార్డ్ ఎన్. పోట్స్ మెడల్, 1927 లో లూయిస్ ఇ.లెవీ మెడల్1939 లో ఫారడే మెడల్, 1944 లో ఫ్రాంక్లిన్ మెడల్ ,

1975 లో నేషనల్ ఇన్వెంటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్ కు ఎంపిక కాబడినారు. ఈ ఎంపిక ఆయన తన 101 వ సంవత్సరంలో మరణించుటకు కొన్ని రోజుల ముందుగా న్యూయార్క్ లోని షెనెక్టడీలో పొందారు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

వ్యంగ్య చిత్రకారులలో సాటి లేని మేటి ఆర్. కె.లక్ష్మణ్

నేడు ఆర్ కె లక్ష్మణ్ జయంతి

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించ బడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష వూహా చిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం. ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహ విగ్రహం ప్రతిష్ఠించారు. భారతదేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం.

ఆర్.కె.లక్ష్మణ్ గా లబ్ధ ప్రతిష్ఠులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 - జనవరి 26 2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించ బడే ఆంగ్ల దిన పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా లో ప్రతిరోజూ




వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండేవారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించు కున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయ రంగాన్ని సరైన పంధాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది. లక్ష్మన్ అంటే, రాజకీయ నాయకులందరికీ గౌరవం, అంతకుమించి ఎనలేని ప్రేమ. 2003లో తీవ్ర అస్వస్థులై ఆసుపత్రిపాలైనప్పుడు, దేశంలోని హేమాహేమీలందరూ ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆదుర్దాతో తెలుసు కోవడమే కీఆకుండా, నాటి ఉపరాష్ట్రపతి భైరవ్ సింగ్ షేకావత్ తో సహా చాలా మంది ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.

ఆర్కే లక్ష్మణ్ మైసూర్ నగరంలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తండ్రి పాఠశాల ప్రధానోపాధ్యయులు. లక్ష్మణ్ ఆరుగురు సంతానంలో చిన్నవాడు. ఆయన అన్నలలో ఒకరైన ఆర్.కె. నారాయణ్ మాల్గుడి డేస్ కథలు రచించిన ప్రముఖ ఆంగ్ల రచయిత కావడం యాదృచ్ఛికం. చిన్నతన నుండి లక్ష్మణ్ కు బొమ్మల పుస్తకాలు చూసే అలవాటు ఉ ండేది. ఆంగ్ల పత్రికలైన స్ట్రాండ్ (స్రీతీఖఅఽ), పంచ్ (ృబఅఎష్ట్ర), బైస్టాండర్ (దీఎఝ్ఘఅఽవతీ), వైడ్-వరల్డ్ (ఔఱఽవ ఔశీతీశ్రీఽ), టిట్ బిట్స్ (ఱఱఽ దీఱ్ఱం) వంటి బొమ్మల కార్టూన్ పుస్తకాలను, తాను చదవటం నేర్వకముందే చూసేవాడు. బొమ్మల పుస్తకాలు చూస్తూ, మెల్లిగా గీతలు గీస్తూ బొమ్మలు వెయ్యటం మొదలు పెట్టారు. నేల మీద, గోడల మీద, తలుపుల మీద, ఎక్కడ పడితే అక్కడ రకరకాల బొమ్మలు వేసేవారు. తన ఉపాధ్యాయులనూ వదలక వాటి చిత్రాలుకూడ వేసారు. తాను వేసిన బోధి వృక్షం ఆకు బొమ్మను టీచర్లు కూడా మెచ్చుకున్నప్పుడు తానొక చిత్రకారుడిగా తయారయ్యే అవకాశం ఉన్నదని భావించారు.

ఉన్నత పాఠశాల తరువాత, లక్ష్మణ్ బొంబాయి (ఇప్పటి ముంబాయి) లోని జె.జె ఇన్సిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్ లో చేరి బొమ్మలు వేయటం నేరుకోవటానికి, తన దరఖాస్తు చేశారు. కాని, ఆ పాఠశాల ప్రధాన అధికారి, అటువంటి బొమ్మలు వేసేవాడు తమ స్కూలులో విద్యార్థిగా ఉండ తగడు అని చేర్చుకోలేదని చెపుతారు.

అయితే లక్ష్మణ్ ఆ తర్వాత అదే పాఠశాల... ఏ పాఠశాలలో బొమ్మలు వేయటం నేర్చుకోవటానికి ప్రవేశం లభించలేదో,



దాని పక్కనే ఉన్న ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో కొన్ని దశాబ్దాల పాటు వారి కార్టూనిస్ట్‌గా ఉండి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవటం ఆయన అకుంఠిత దీక్షకు నిదర్శనం. చివరకు మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. చదివి పట్ట భద్రుడయి, చదువు కొనసాగిస్తూనే బొమ్మలు వేస్తూ , ఫ్రీలాన్స్ (స్వతంత్ర) చిత్రకారునిగా కొనసాగారు. ఆ కాలంలోనే "స్వరాజ్య" అన్న పత్రికలో కార్టూన్లు వేశారు. అలాగే, నారద అనే కార్టూన్ సినిమాకు కూడా బొమ్మలు వేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



ఆర్చరీలో శీతల్ దేవి అద్భుతం

పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం

నగోయా: శీతల్ దేవికి చేతులు లేవు. కానీ ఆమె ఆర్చరీలో దిట్ట. ఇండియన్ ఆర్చర్ శీతల్ దేవి.. ఏషియన్ పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం గెలిచింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్‌లోనూ ఆమె గోల్డ్ మెడల్ గెలుచుకున్నది. ఉత్కంఠంగా సాగిన ఫైనల్లో ఆమె సింగపూర్ అథ్లెట్ ఆలిమ్ నుర్ స్యాహిదాను ఓడించింది. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్ టీమ్ గోల్డ్ మెడల్ గెలిచిన కొన్ని గంటల వ్యవధిలోనూ వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్ దేవి అద్భుత ప్రదర్శన ఇచ్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. 19 ఏళ్ల వరల్డ్ చాంపియన్ శీతల్ దేవి 142-139 స్కోరుతో ఆలిమ్‌పై విజయం సాధించింది. 2023 హాంగ్‌జూ గేమ్స్‌లోనూ ఆమె ఆలిమ్‌పైనే విక్టరీ కొట్టింది. ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్ దేవి ఖాతాలో మొత్తం మూడు పతకాలు ఉన్నాయి. మహిళల డబుల్స్ సిల్వర్ కూడా గెలిచిందామె.



భళా సింధు..

పారిస్, అక్టోబర్ 22 : ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ సిరీస్‌లో పీవీ సింధు తొలిరౌండ్ అదరగొట్టింది. మహిళల సింగిల్స్ ఫస్ట్ రౌండ్‌లో సింధు 21-14, 8-21, 23-21తో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిద కేట్‌థాంగ్‌పై గెలిచి రెండో రౌండ్‌కు చేరింది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ గంటకు పైగా సాగిన పోరులో తొలి గేమ్‌ను ఈజీగానే గెలుచుకున్న ఈ తెలుగు తేజం.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి పుంజుకోవడంతో వెనుకబడింది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆమె ఒక దశలో 8-19తో వెనుకంజలో ఉంది. ఈ స్థితిలో ఒక ప్లేయర్ వరుసగా పాయింట్లు సాధించి మ్యాచ్‌ను దక్కించుకోవడం అసాధ్యమే. కానీ సింధు మాత్రం దీనిని సుసాధ్యం చేసింది. ఆ దశలో ఏదో పూనకం వచ్చినట్టుగా ఆడిన సింధు.. వరుసగా 11 పాయింట్లు సాధించి 19-19తో స్కోర్లను సమం చేసింది. ఆ తర్వాత ఉత్కంఠ పోరులో 23-21తో గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, లక్ష్యసేన్ ఫస్ట్ రౌండ్‌కే నిష్క్రమించగా ఉన్నతి హుడా, దేవికా కూడా తొలిరౌండ్ విఘ్నాన్ని దాటలేకపోయారు.

హైదరాబాద్‌కు రెండో విజయం

ఆంధ్రాపై గెలుపుతో గ్రూప్-బీలో అగ్రస్థానం

విజయవాడ: రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో హైదరాబాద్ రెండో విజయాన్ని నమోదుచేసింది. ఎలైట్ గ్రూప్-బీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్.. ఆంధ్రాను 267 పరుగుల తేడాతో చిత్తుచేసి భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బౌలర్లు చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు బ్యాటర్లను 130 పరుగులకే కుప్పకూల్చింది. హైదరాబాద్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 275 రన్స్ చేయగా రెండో ఇన్నింగ్స్‌ను 306/7 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి ఆంధ్రాను 184 రన్స్‌కే కట్టడిచేయడంలో కీలకపాత్ర పోషించిన స్పిన్ ఆల్‌రౌండర్ తనయ్ త్యాగరాజన్.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ ఆరు (6/35) వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో గ్రూప్-బీలో హైదరాబాద్ 13 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.



న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

4 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ!

- తొలి టీ20లో కివీస్‌కు షాకిచ్చిన టీమిండియా
- 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి సంచలన విజయం
- 67 పరుగులతో చెలరేగిన సంజు శాంసన్
- చివర్లో నామన్ ధీర్ మెరుపులు.. 15 బంతుల్లోనే 42 పరుగులు
- వృథా అయిన గ్లెన్ ఫిలిప్స్ 82 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్



క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 22: న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు విజయంతో శుభారంభం చేసింది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో ఆతిథ్య న్యూజిలాండ్‌పై భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఒక దశలో వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియా చివర్లో అద్భుతంగా పుంజుకుంది. సంజు శాంసన్ మెరుపు అర్ధశతకం, శ్రేయాస్ అయ్యర్ కీలక ఇన్నింగ్స్, నామన్ ధీర్ విధ్వంసక బ్యాటింగ్‌తో కివీస్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. న్యూజిలాండ్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేయగా, భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. సీఫర్ట్ 17 బంతుల్లో 24 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 24 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు సాధించాడు. డారిల్ మిచెల్ 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 40 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 82 పరుగులు చేసి న్యూజిలాండ్‌కు భారీ స్కోరు అందించాడు. బెవోన్ జాకబ్స్ 16 బంతుల్లో 31 పరుగులు జోడించడంతో కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 51 పరుగులు సమర్పించుకోగా, భువనేశ్వర్ కుమార్ 49 పరుగులు ఇచ్చాడు. 226 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అభిషేక్ శర్మ కేవలం 12 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 పరుగులు చేసి కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 67 పరుగులు చేసి లక్ష్య ఛేదనకు బలమైన పునాది వేశాడు. అయితే అభిషేక్ శర్మ ఔటైన తర్వాత భారత ఇన్నింగ్స్‌లో అనూహ్య మలుపులు చోటుచేసుకున్నాయి. సంజు శాంసన్ 67 పరుగుల వద్ద పెవిలియన్ చేరగా, తిలక్ వర్మ ఆరు పరుగులకే ఔటయ్యాడు. ఇషాన్ కిషన్ కూడా ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. దీంతో భారత్ ఒక దశలో 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. వరుస వికెట్ల పతనంతో కష్టాల్లో పడిన భారత జట్టును కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్ ఆదుకున్నారు. వీరిద్దరూ సమయోచితంగా బ్యాటింగ్ చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. శ్రేయాస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేయగా, అక్షర్ పటేల్ 14 బంతుల్లో 24 పరుగులు సాధించాడు. ఈ ఇద్దరి కీలక భాగస్వామ్యంతో భారత్ తిరిగి విజయంపై ఆశలు పెంచుకుంది. అయితే అక్షర్ పటేల్, శ్రేయాస్ అయ్యర్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో మ్యాచ్ మరోసారి ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లలో భారత విజయానికి వేగంగా పరుగులు అవసరమైన పరిస్థితి ఏర్పడింది. మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా మారిన సమయంలో నామన్ ధీర్ క్రీజులో నిలబడి అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శించాడు. న్యూజిలాండ్ బౌలర్లపై ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఎదురుదాడికి దిగాడు. కేవలం 15 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 42 పరుగులు చేసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. చివరి వరకు క్రీజులో నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. నితీశ్ కుమార్ రెడ్డి రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచి అతడికి సహకరించాడు. దీంతో భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్లకు 230 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారీ స్కోరు నమోదు చేసినప్పటికీ భారత బ్యాటర్ల దూకుడు ముందు న్యూజిలాండ్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. తొలి టీ20లో ఉత్కంఠ విజయంతో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనను విజయవంతంగా ప్రారంభించింది.

ఆస్ట్రేలియా ఓడినా అగ్రస్థానం పదిలం!

దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో కంగారూలకు ఓటమి ముప్పు

సెయింట్ జార్జ్ పార్క్, అక్టోబర్ 22 : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఓటమి అంచున నిలిచినా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆ జట్టు అగ్రస్థానానికి ఎలాంటి ముప్పు లేకపోవడం విశేషం. సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా విజయానికి చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కొని మ్యాచ్‌ను కాపాడుకోవడం కంగారూలకు సవాల్‌గా మారింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. మార్కో జాన్సన్, సైమన్ హార్మర్ కూడా రాణించడంతో ఆ జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. మార్కో జాన్సన్ ఐదు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. దీంతో ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 326 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ కంగారూలు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 156 పరుగులు మాత్రమే చేయగలిగారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. ట్రావిస్ హెడ్ సెంచరీకి చేరువలో ఉండగా, స్టీవ్ స్మిత్ వంటి స్టార్ బ్యాటర్లు ఇంకా రావాల్సి ఉంది. అయితే దక్షిణాఫ్రికా పటిష్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొంటూ చివరి రోజు మొత్తం క్రీజులో నిలవడం ఆస్ట్రేలియాకు కత్తిమీద సాములా మారింది. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 81.82 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 60 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధిస్తే ఆ జట్టు పాయింట్ల శాతం పెరిగినప్పటికీ మూడో స్థానంలోనే కొనసాగుతుందని అంచనా. ఆస్ట్రేలియా ఓడిపోయినా 75 శాతం పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటుంది. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిసినా రెండు జట్ల పాయింట్ల శాతాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే ఆస్ట్రేలియా మొదటి స్థానంలో, దక్షిణాఫ్రికా మూడో స్థానంలోనే కొనసాగనున్నాయి. ప్రస్తుతం అందించిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక వివరాల ప్రకారం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ రెండో స్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా మూడో స్థానంలో, బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉన్నాయి. భారత జట్టు ఐదో స్థానంలో ఉండగా, ఇంగ్లండ్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఫలితం ఎలా ఉన్నా అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో హ్యారీ బ్రూక్ విధ్వంసం

శ్రీలంకపై ఇంగ్లాండ్ రికార్డుల మోత!

రావల్పిండి/హైదరాబాద్, అక్టోబర్ 22: పాకిస్థాన్ వేదికగా రావల్పిండిలో జరుగుతున్న వన్డే ట్రై సిరీస్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. శ్రీలంకతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుతమైన ద్విశతకంతో విరుచుకుపడటంతో ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగుల కొండంత స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 116 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 174.13 స్ట్రైక్‌రేట్‌తో 202 పరుగులు చేసి మ్యాచ్ చివరి బంతికి నిష్క్రమించాడు. దీనితో వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా బ్రూక్ రికార్డు పుటలకెక్కిడు. బ్రూక్ మొదటి సెంచరీకి 75 బంతులు తీసుకోగా, ఆ తర్వాత కేవలం 36 బంతుల్లోనే రెండో సెంచరీ పూర్తి చేయడం విశేషం.

జో రూట్, విల్ జాక్స్ అర్ధసెంచరీలు:

బ్రూక్‌కు తోడుగా ఇంగ్లాండ్ బ్యాటర్లందరూ దాడికి దిగారు. విల్ జాక్స్ కేవలం 30 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, జో రూట్ 66 బంతుల్లో 69 పరుగులు చేశాడు. ఓపెనర్లు టామ్ బాంటన్ (50), బెన్ డకెట్ (29) కూడా జట్టుకు మంచి శుభారంభాన్ని ఇచ్చారు. చివరి 5 ఓవర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఏకంగా 78 పరుగులు పిండుకోవడంతో శ్రీలంక బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లాలాగే 2 వికెట్లు తీయగా, అసిత ఫెర్నాండో, జనిత్ లియానాగే చెరో వికెట్ సాధించారు. శ్రీలంక ముందు ఇప్పుడు 430 పరుగుల భారాత్మక లక్ష్యం ఉంది.






భాగ్యశ్రీ గ్లామర్ మెరుపులు

తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మరోసారి గ్లామరస్ లుక్‌తో సందడి చేశారు. సాయి అభ్యంకర్‌తో కలిసి ఆమె నటించిన బ్రేకప్ సాంగ్ 'రాధిమా' ఇప్పటికే 10 కోట్ల వ్యూస్‌కు చేరువవుతూ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. తాజాగా భాగ్యశ్రీ ధరించిన వైన్ మెరూన్ రంగు శాటిన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆఫ్‌షోల్డర్ నెక్‌లైన్, నడుము భాగంలో ముడతల డిజైన్, కిందివైపు సున్నితంగా పరుచుకున్న చిఫాన్ ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు ఆమెకు అందమైన రూపాన్ని అందించాయి. హై స్లిట్‌తో కూడిన గౌన్‌కు చిన్న పెండెంట్, చెవిపోగులు, మెరిసే చెప్పులు జతచేశారు. జుట్టును పైకి ముడివేసి సరికొత్త స్టైలింగ్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. శివకార్తికేయన్ సరసన తమిళ చిత్రం 'సేయోన్'లో భాగ్యశ్రీ నటించనున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు, ఆమె నటిస్తున్న మలయాళ సినిమా 'ఆపరేషన్ గంగా' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది





సంప్రదాయ చీరకట్టులో శ్రీలీల సందడి

టాలీవుడ్‌లో తనదైన నటన, అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి శ్రీలీల మరోసారి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఆవిడ ధరించిన చీరకట్టు అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ధమాకా', 'భగవంత్ కేసరి' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. 'కిస్సిక్' పాటతో దేశవ్యాప్తంగా మరింత పాపులారిటీ సంపాదించారు. ఈసారి శ్రీలీల ఆవాల పసుపు రంగు రఫుల్స్ చీరలో కనిపించారు. అద్దాల అలంకరణతో కూడిన అంచులు, చిన్న పూల డిజైన్లు చీరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బంగారు రంగు ఎంబ్రాయిడరీతో రూపొందించిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. విరబోసిన జుట్టు, సహజమైన మేకప్‌తో సంప్రదాయానికి ఆధునిక శైలిని జోడించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో శ్రీలీల నటించనున్నారు. మరోవైపు, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించనున్న సినిమాలోనూ ఆమె భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.




ఆరెంజ్ డ్రెస్‌లో ఫాజీ భామ క్యూట్ లుక్

డ్యాన్స్ రీల్స్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వీ.. తన అందం, హావభావాలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే భారీ సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న ఈ భామ.. వెండితెరపై అడుగుపెట్టకముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా ఇమాన్వీ ఆరెంజ్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిశారు. స్క్వేర్ నెక్‌లైన్, కిందివైపు విస్తరించిన డిజైన్‌తో ఉన్న ఈ దుస్తులకు జుట్టులో తెల్లని రిబ్బన్, గోల్డ్ హూప్ చెవిపోగులు జతచేశారు. పలుచని లేయర్డ్ నెక్లెస్, ఉంగరం, బ్రేస్‌లెట్‌తో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. సహజమైన మేకప్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇమాన్వీ సినీ రంగ ప్రవేశం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రంతో జరగనుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి చిత్రంతోనే వెండితెరపై ఇమాన్వీ ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రూటు మార్చిన స్వీటీ..

లేడీ ఓరియెంటెడ్ కథలకు గ్యాప్!

టాలీవుడ్ కథానాయిక అనుష్క శెట్టి (స్వీటీ) తన కెరీర్ ప్లానింగ్‌ను పూర్తిగా మార్చేసింది. 'భాగమతి' తర్వాత కేవలం లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తూ వచ్చిన స్వీటీకి, ఇటీవల వచ్చిన 'ఘాటి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ మిగిల్చింది. దాంతో సోలోగా సినిమా భారాన్ని మోసే ఫార్ములాను పక్కనపెట్టి, భారీ తారాగణం ఉండే పెద్ద ప్రాజెక్టుల వైపు ఆమె చూపు తిప్పినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మలయాళ స్టార్ హీరో జయసూర్య నటిస్తున్న భారీ ఫాంటసీ థ్రిల్లర్ 'కథనార్'లో అనుష్క 'నీలి' అనే కీలక పాత్ర పోషిస్తోంది. రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్‌లో తన లుక్‌తో మంచి బజ్ క్రియేట్ చేసింది. సోలో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, ఇలాంటి క్రేజీ మల్టీస్టారర్ కాన్సెప్ట్‌లతో మళ్లీ కమర్షియల్ ట్రాక్‌లోకి రావాలని అనుష్క భావిస్తోంది. త్వరలోనే ఆమెను మళ్లీ స్టార్ హీరోల సరసన చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com